జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | ఆదివారం 22 మార్చి 2026 | సంపుటి: 19 | 01 | పేజీలు: 23 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

విశ్వావసు నామ సంవత్సరం , మాఘ మాసము , ఫల్గుణం, తిథి: ద్వాదశి - 20:45:45 వరకు నక్షత్రం: పునర్వసు - 09:35:50 వరకు కరణం: బవ - 09:38:55 వరకు, బాల: వ - 20:45:45 వరకు పక్షం: శుక్ల యోగం: సౌభాగ్య - 17:01:49 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## దేశంలో అతిపెద్ద చౌరబాటుదారుడు మోదీయే

**ఈద్ ర్యాలీలో మమత బెనర్జీ వ్యాఖ్యలు**

కోల్‌కతా,మార్చి21(ప్రజాజ్యోతి): దేశంలో అతిపెద్ద చౌరబాటుదారుడు ప్రధాని

మిగతా1 2లో..

## ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం

స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్,మార్చి21(ప్రజాజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం చేరింది. ఖైరతాబాద్

మిగతా 2లో..



# తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

## దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్

- హిందూ మహాసముద్రంపైకి బాలిస్టిక్ క్షిపణులు
- ఇజ్రాయిల్ యుద్ధవిమానం ఇరాన్ కూల్చివేత
- దాడులతో దద్దరిల్లుతో పశ్చిమాసియా
- ఇరాన్ అణు కేంద్రంపై వైమానిక దాడులు
- అంతర్జాతీయ ఉల్లంఘనేనని ఇరాన్ ఆరోపణ

టెహ్రాన్,మార్చి21(ప్రజాజ్యోతి): రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది.

మిగతా 2లో..

## ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్

న్యూఢిల్లీ,మార్చి21(ప్రజాజ్యోతి): ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు

మిగతా 12లో..

## యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత
- హర్మూజ్‌ని తెరవండి: ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి



వాషింగ్టన్,మార్చి21(ప్రజాజ్యోతి): యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు

మిగతా 2లో..



# వ్యవసాయ రంగంలో మరో మైలురాయి

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సీఎం రేవంత్ ప్రారంభం

భారీగా ఏర్పాట్లు చేసిన వ్యవసాయాధికారులు

రైతుబంధు నిధులను కూడా విడుదల చేయనున్న సీఎం

సీఎం రాకతో నర్మెట్టలో భారీగా బందోబస్తు ఏర్పాట్లు

సిద్దిపేట,మార్చి21(ప్రజాజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది. మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్

మిగతా 12లో..



## డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

**అధికారుల అదుపులో అభిషేక్ సింగ్**

- మొయినాబాద్ ఫామ్‌హౌజ్ సీజ్
- అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్
- రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు

రంగారెడ్డి,మార్చి21(ప్రజాజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్

మిగతా 12లో..

# జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

పార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి

పార్టీలో అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత

భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి

జగిత్యాల,మార్చి21(ప్రజాజ్యోతి): పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్య ఉంటే అధిష్టానంతో మాట్లాడుదామని, పార్టీ మారే ఆలోచన మంచిది కాదని సూచించారు. దీనికి జీవన్ రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ

మిగతా 2లో..

## మరింత దిగిన బంగారం ధర

**24 క్యారెట్ పై 2,940 రూపాయలు తగ్గుదల**

న్యూఢిల్లీ,మార్చి21(ప్రజాజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా భారత దేశంలో బంగారం ధరలు రోజురోజుకు భారీగా తగ్గుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. మార్చ్ 20న హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర

మిగతా 12లో..

# శ్రమ ఫలితం మాది.. శిలాఫలకాలు మీవా?

నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం

కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం

ఒక్కటంటే ఒక్క పనిచేయని సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంభోత్సవాలకు రావడం.. రిబ్బన్ కట్ చేయడం మీ వంతా

మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట,మార్చి21(ప్రజాజ్యోతి): సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్తానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో

మిగతా 2లో..

## మొన్న భార్య.. నేడు భర్త ఆత్మహత్య

కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం

కరీంనగర్,మార్చి21(ప్రజాజ్యోతి): కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని

మిగతా 12లో..

## తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

**ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు**

**మీరాలం ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు**

హైదరాబాద్,మార్చి21(ప్రజాజ్యోతి): దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ

మిగతా 12లో..



# సంపాదకీయం

## రుణ విముక్తి చర్యలను పట్టించుకోని బడ్జెట్

దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏం గొప్ప పనులు చేశారంటే ఏమీ లేదు. ఉన్న అప్పులకు మిత్తీలు కట్టడం, కొత్తగా అప్పులు తేవడం తప్ప, తెలంగాణను రుణం నుంచి విముక్తి చేసే ఆలోచన ఒక్కటీ కానరాలేదు. కెసిఆర్‌ను మించి అప్పులు చేస్తూ పోతే మరో వంద ఏళ్లయినా అప్పులు తీరవు. దీనిపై ఆలోచన, ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రసంగాలు సాగుతున్నాయి. మేము ఎంచుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నాం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగాం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును, తిరిగి వారి అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం ఆర్థిక మంత్రిగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క గొప్పగా చెప్పుకున్నారు. కానీ డబ్బు ఆదా చేయడం, వృధా చేయకుండా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎక్కడా ప్రస్తావించలేదు. ఎక్కడ వృధా అవుతుందో కూడా గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. గ్రామాలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించే ప్రయత్నం జరగడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలకు డబుల్ పెన్షన్లు, లక్షల్లో జీతాలు ఎందుకో చెప్పడం లేదు. కిలో రూపాయి బియ్యం వృధాను అరికట్టడం లేదు. పెన్షన్ల వృధాను గుర్తించడం లేదు. ఇవన్నీ కట్టడి చేస్తే కొంతయినా మిగులుబాటు ఉంటుంది. ఇకపోతే కేవలం సంక్షేమం తప్ప అభివృద్ధి జరగడం లేదు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా, వాటిని పట్టించుకోవడం లేదు. వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చిన ఘనత వీరిది. వేల ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతం అయి, దేవాలయాలు పాడుబడ్డా పట్టింపు లేదు. ఉత్సవాలు నిర్వహించుకోవడం తప్ప దేవాదాయశాఖ మంత్రికి ఏ భూమి ఎక్కడ ఉందో లేదో తెలియదు. రోడ్లు ఎలా ఉన్నాయో రోడ్లు భవనాల శాఖ మంత్రికి తెలియదు. ప్రభుత్వమంటే పంచి పెట్టడం కాదు. ఆదాయాన్ని ఆదా చేయాలి. అప్పులు లేకుండా చేయాలి. అలా కాకుండా సంక్షేమాల పేరుతో దుబారా చేయడం వల్ల అభివృద్ధి ఆగిపోతోంది. తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఇది కేవలం రేషన్ కార్డులు ఉన్నవారికే అని చెప్పకనే చెప్పారు. రేషన్ కార్డుల్లో బోగస్ ఎత్తివేస్తే అనేకమంది పేదలకు లబ్ది చేకూరుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇది ఎవరికన్నది స్పష్టత లేదు. అన్ని కుటుంబాలకు వర్తిస్తుందా అన్నది చెప్పాలి. ఇకపోతే ఆసుపత్రులు కునారిల్లుతున్నాయి. వాటిని పటిష్టం చేయాల్సి ఉన్నా గత రెండేళ్లుగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. హాస్టళ్లునరక కూపాలుగా ఉన్నా వాటిని ఉద్ధరించలేదు. ఉన్న స్కూళ్లను సంస్కరించడం లేదు. కానీ కొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలన్న లక్ష్యం మంచిదే. కానీ ఉన్న స్కూళ్లను బాగుచేసి, అధ్యాపకులను భర్తీ చేస్తే మంచిది. ఇకపోతే మూసీ కాలుష్యం నుంచి రాజధానివాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పం ఆహ్వానించదగ్గదే. గత బడ్జెట్ అంచనాలకన్నా అదనంగా పెంచిన రూ.43 వేల కోట్ల బడ్జెట్ ఆదాయ అంచనాలలో ఏ పద్దు కింద ఎంత పెరుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వం ఉజ్జాయింపుగా తెలిపింది. పన్నులద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,710 కోట్లు, కొత్త రుణాలు రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది. ఈ అంచనాల ప్రకారమే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పెంచింది. కానీ ఆదాయం అదనంగా పెరుగుతుందని పెట్టుకున్న లక్ష్యాల్లో అన్నీ నెరవేరతాయా అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు వచ్చే ఏడాది అదనంగా రూ.13 వేల కోట్లు పెరుగుతాయని తెలిపింది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పద్దు కింద కేంద్రం నుంచి బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనా ప్రకారం నిధులు రాలేదు. కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని గత బడ్జెట్‌లో అంచనా వేస్తే రూ.11,161 కోట్లే వచ్చినట్లు సవరణ పద్దు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీల చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులతో పోతున్నందున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా తీసుకునే రుణాలే కీలకంగా మారనున్నాయి. ప్రస్తుత ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.67,539 కోట్లను సేకరించారు. ఇక వచ్చే ఏడాదికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్లు, ఇతర మార్గాల్లో మరికొన్నికలిపి మొత్తం రూ.82,870 కోట్ల కొత్త రుణాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్న తరుణంలో అందుకు అనుగుణంగా కూడా ఆలోచన చేయకపోవడం గమనార్హం. ఎప్పటికైనా ఉచిత పథకాలు తగ్గించుకోవడం, ఖర్చులు తగ్గించుకోవడం చేయనంత వరకు బడ్జెట్ కేటాయింపులు ఘనంగానే ఉంటాయి. ఆయరణలో దెబంతింటాయి.

## యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

మొదటిపేజీ తరువాయి..

డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు.


ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించడానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు. హర్మూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. దాడులు కూడా ఆపాలని కోరాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను ఖండించాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాలపై దుష్ప్రభావం పడుతోందని పేర్కొన్నాయి. ఈమేరకు యూఏఈ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా పౌర మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధిని మూసివేయడాన్ని ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై ప్రభావం పడుతోందని యూఏఈ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి.

# తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

మొదటిపేజీ తరువాయి..

ఈ దాడిలో రెండో మిస్సైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టా÷-గ్గ÷ట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్-2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్-యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళ్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల వేళ..ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు అడ్డుకట్ట పడటం లేదు. తమ భూభాగంపై దాడికి దిగిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాన్ని కూల్చేసినట్టు ఇరాన్ మిలిటరీ శనివారంనాడు ప్రకటించింది. దీనికి ఒకరోజు ముందే అమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాన్ని ఢీ కొట్టామని ఇరాన్ ప్రకటించుకుంది.



ఇజ్రాయెల్ యుద్ధవిమానంపై దాడి జరిగినట్టు ఇజ్రాయెల్ కూడా గుర్తించిందని 'టెహ్రాన్ టైమ్స్' తెలిపింది. తమ యుద్ధవిమానాన్ని టా÷-గ్గ÷ట్ చేస్తూ ఉపరితలం నుంచి గగనతలంపైకి క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయల్ మిలిటరీ పేర్కొంది. ఏ తరహా యుద్ధ విమానం అనేది మాత్రం వెల్లడించలేదు. కాగా, ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్ విమానంపై క్షిపణి ప్రయోగం జరిగిందని, అయితే విమాన సిబ్బంది ప్రామాణిక విధానాలను అనుసరించడం ద్వారా ముప్పును తప్పించారని, ఎలాంటి నష్టం లేకుండా మిషన్‌ను పూర్తి చేశారని 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' పేర్కొంది. ఇరాన్ క్షిపణి అతి సమీపానికి రావడంతో పైలట్ వృత్తిపరమైన నైపుణ్యంతో అత్యంత వేగంగా స్పందించి దాడిని తప్పించినట్టు ఆ కథనం పేర్కొంది. విమానానికి నష్టం జరిగినట్టు ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై ఇటీవల దాడులు జరిపిన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు శనివారంనాడు మరోసారి విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు లీక్ అవ్వలేదని, పరిసర ప్రాంత నివాసితులకు ప్రమాదం వాటిల్లలేదని వార్తా సంస్థలు తెలిపాయి. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్ నేరపూరిత చర్యల్లో భాగంగానే ఈదాడి జరిపిందని, అణుభద్రతా నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలకు తూట్లు పొడిచిందని నిప్పులు చెరిగింది. తాజాగా ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు పాల్పడినట్టు స్థానిక మీడియా సంస్థ తస్నిమ్ తెలిపింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత నతాంజ్ అణు క్షేత్రంపై దాడులు చేయడం ఇది రెండోసారి. నతాంజ్ అణు క్షేత్రంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడ్డాయని, అయితే రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యా లేదని తెలిపింది నతాంజ్ క్షేత్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే .తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. నెతన్యాహు ప్రకటించిన కొద్ది గంటల్లోనే నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరగడం గమనార్హం. నతాంజ్ అణు కేంద్రం టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది.

## దేశంలో అతిపెద్ద చొరబాటుదారుడు మోదీయే

మొదటిపేజీ తరువాయి..

మోదీయే అని విమర్శించారు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ. బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో శనివారం జరిగిన ఈద్ ర్యాలీలో మమత పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మోదీపై, బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'దేశంలో అతిపెద్ద చొరబాటుదారుడు మోదీ. బెంగాల్‌ను ఎవరు లక్ష్యంగా చేసుకుంటారో వారు నరకానికి వెళ్తారు. బీజేపీని రాష్ట్రంలోకి రాకుండా చూస్తాం. మోదీ నుంచి, బీజేపీ నుంచి దేశాన్ని, బెంగాల్‌ను కాపాడటమే టీఎంసీ ప్రాథమిక కర్తవ్యం. బెంగాల్ మత సామరస్యాన్ని కాపాడుతాం. సర్ ద్వారా ప్రజల ఓటు హక్కుల్ని కాలరాసింది బీజేపీ. సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాం. బీజేపీ అంటే గూండాలు, దొంగల పార్టీ. మీ ఓటు హక్కును మోదీ తీసుకోకుండా చూస్తా. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి పౌరుడి హక్కుల్ని కాపాడేందుకు పోరాడుదాం. కొందరు ప్రజల ఓట్లు సర్ పేరుతో తీసేశారు. నేను దీనికోసం కోల్‌కతా నుంచి ఢిల్లీ వరకు, హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా వెళ్తా. ప్రజల హక్కులకు రక్షణ దొరుకుతుందనుకుంటున్నా. బెంగాల్‌లోని అన్ని కులాలు, వర్గాల ప్రజలకు అండగా ఉంటా' అని మమత వ్యాఖ్యానించారు. అయితే, మమత వ్యాఖ్యలపై బెంగాల్ బీజేపీ నేతలు మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే నిరాశ, భయంతో మమత ఇలా ప్రధానిపై విమర్శలు చేస్తున్నారని బీజేపీ నేత శిశిర్ బజోరియా అన్నారు. మమత ఉపయోగించిన భాష సరికాదన్నారు. ప్రధాని మోదీని చొరబాటుదారుడు అని ఎవరు అన్నా వారికి రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగే అర్హత లేదని విమర్శించారు. ఇక, బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడుతాయి.

## ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి..

ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరపున, స్పీకర్ తరపున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.

## జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

మొదటిపేజీ తరువాయి..

అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారంతో ఇద్దరు మంత్రులను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపు తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చించారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

## శ్రమ ఫలితం మాది.. శిలాఫలకాలు మీవా?

మొదటిపేజీ తరువాయి..

పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మేట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మేట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయీ పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్థాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్?కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600-1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి టీకా పంపిణీ!



**నేరడిగొండ మార్చి 21 (ప్రజాజ్యోతి) :** పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఈరోజు కుమారి గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండీ) నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమారి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లాస్మన్న ముఖ్య అతిథిగా హాజరై, టీకా కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్య డాక్టర్ రాథోడ్ జీవన్ మాట్లాడుతూ, "పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందుస్తు జాగ్రత్తగా ఈ టీకాలు వేయించడం చాలా ముఖ్యం. ఈ వ్యాధి సోకితే పశువులు తీవ్ర అనారోగ్యానికి గురవుతాయి మరియు పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. రైతులు తమ పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందుగానే టీకా వేయడం ఉత్తమం" అని అన్నారు. సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లాస్మన్న మాట్లాడుతూ, "మా గ్రామంలో పశువుల ఆరోగ్యం పట్ల పశు వైద్య శాఖ తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. గ్రామంలోని రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని కోరుతున్నాను. ఇది పశువుల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా రైతుల ఆర్థిక భద్రతకు కూడా దోహదం చేస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శాఖ సిబ్బంది. విస్తరణ అధికారి వెంకన్న, అసిస్టెంట్ శివ, గోపాలమిత్ర కూన సురేష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందు

- స్నేహితులకు రంజాన్ భోజనాలు ఏర్పాటు చేసిన అజ్జు ఖాన్




**నేరడిగొండ మార్చి 21 (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రంలో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని సామాజిక కార్యకర్త అజ్జు ఖాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రోజు స్నేహితులకు మరియు సన్నిహితులకు ఘనంగా రంజాన్ విందు (ఇఫ్తార్) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అజ్జు ఖాన్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగ సోదరభావానికి, త్యాగానికి చిహ్నమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ విందు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విందులో పాల్గొన్న అతిథులు రంజాన్ ప్రత్యేక వంటకాలను ఆస్వాదిస్తూ, ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**సామూహిక ప్రార్థనలు :** విందుకు ముందు అందరూ కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోదరభావం: వివిధ రంగాలకు చెందిన స్నేహితులు ఈ కార్యక్రమంలో పాల్గొని మత సామరస్యాన్ని చాటారు. అజ్జు ఖాన్ ఆయన సోదరుడు నిషు కుటుంబ సభ్యులు స్వయంగా అతిథులకు ఆత్మీయంగా వడ్డించి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అజ్జు ఖాన్ కుటుంబ సభ్యులు, మిత్రబృందం బండారి విద్యాసాగర్ ఐకెపి, డాక్టర్ రాజు యాదవ్, ఆర్ గణేష్, మాడవి వసంత్, తుక్కారెడ్డి రాజు, అలకంటి సతీష్, సాయి చరణ్ మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గోవింద్ నాయక్ సేవలు చిరస్మరణీయం

- ఆయన లోటు పూడ్చలేనిది.
- కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపిన
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్




**ఖానాపూర్ మార్చి 21 (ప్రజాజ్యోతి) :** ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే గోవింద్ నాయక్ సేవలు చిరస్మరణీయమని ఆయన మృతి నియోజకవర్గానికి తీరని లోటని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే గోవింద్ నాయక్ మృతి చెందడంతో శనివారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలోని గోవింద నాయక్ నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలతో గోవింద్ నాయక్ అనుబంధం విడదీయలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు భౌతికంగా నేడు గోవింద్ నాయక్ మన మధ్య లేకున్నా... ఆయన చేసిన మంచి పనులతో చిరకాలం ఈ ప్రాంత ప్రజల మనసుల్లో గోవింద నాయక్ నిలిచిపోయారన్నారు. గోవింద్ నాయక్తో తనకున్న అనుబంధాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారిని ఓదార్పు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారుఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో సాగాలన్న గోవింద నాయక్ ఆకాంక్షను నెరవేర్చకు తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ,చైర్మన్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, ప్రెస్ క్లబ్ సభ్యులకు సన్మానం



**జన్నారం,మార్చ్21(ప్రజాజ్యోతి) :** జన్నారం మండలం లోని వివిధ గ్రామాల నుండి ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన గౌడ కులస్తులకు, అదేవిధంగా గత పది రోజుల క్రితం జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన గాజుల లింగన్న గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అమరగొండ సతీష్ గౌడ్ కు శని వారం జన్నారం మండల కేంద్రంలోని మార్కెట్ హాల్లో పొనకల్ గౌడ సంఘం అధ్యక్షులు పోడేటి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చింతలపల్లె సర్పంచ్‌గా గెలుపొందిన పంజాల సురేష్ గౌడ్, కవ్వాల్ వార్డు సభ్యునిగా గెలు పొందిన పోడేటి మల్లేష్ గౌడ్, బాదం పెల్లి నుండి వార్డు సభ్యునిగా గెలుపొందిన నాయిని రమేష్ గౌడ్, చింతలపల్లి నుండి వార్డు సభ్యునిగా గెలుపొందిన బుర్ర గడ్డ జగన్ గౌడ్, కలమడుగు నుండి వార్డు సభ్యునిగా గెలుపొందిన నాయిని భూమా గౌడ్ అదేవిధంగా గత పది రోజుల క్రితం జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన గాజుల లింగన్న గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అమర గొండ సతీష్ గౌడ్‌లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పొనకల్ గౌడ సంఘం అధ్యక్షులు పోడేటి సతీష్ గౌడ్, జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు మూల భాస్కర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు వోల్లాల నర్సాగౌడ్, గౌడ సంఘం నాయకులు పోలేటి నరేష్ గౌడ్, రాస మల్ల ప్రశాంత్ గౌడ్, గర్రెపల్లి శంకర్ గౌడ్, ఏనుగంటి సతీష్ గౌడ్, అంజా గౌడ్, గొల్లపల్లి చంద్రమౌళి గౌడ్, వోల్లాల వెంకటేశ్వర్ గౌడ్, గొల్లపల్లి రమేష్ గౌడ్ వివిధ గ్రామాల నుండి వచ్చిన గౌడ కులస్తులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ నియోజకవర్గాన్ని కలియతిరిగి ముస్లిం పవిత్ర రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

- ముస్లిం మైనార్టీలు ఇదే క్రమశిక్షణతో కొనసాగాలి
- శాసనసభ్యులు డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ వెల్లడి






**ఖానాపూర్ మార్చి 21 (ప్రజా జ్యోతి) :** ముస్లింలకు అత్యంత ప్రీతి పాత్రమైన పండగల్లో రంజాన్ ఒకటని ఈ పండగ సందర్భంగా నెలరోజుల పాటు కటిక ఉపవాసాలు ఉంటూ అల్లాను ప్రార్థిస్తూ తోటి వ్యక్తులతో సోదర భావాన్ని కలిగి క్రమశిక్షణతో మెలిగిన దాన్ని జీవితాంతం కొనసాగించాలని ఖానాపూర్ శాసనసభ్యులు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొజ్జు పటేల్ అన్నారు శనివారం రంజాన్ సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గం అంతా కలియతిరిగి ప్రతి మండల కేంద్రాల్లో ఖానాపూర్ కడెం జన్నారం ఇంద్రవెల్లి ఉట్నూర్ ప్రధాన కేంద్రాలలో ముస్లిం పార్టీ నాయకులతో పాటు వివిధ కుల పెద్దలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు అందజేసి వారు ఇచ్చిన విందుల్లో పలుచోట్ల పాల్గొని సహా పంక్తి ఫలహారాలు స్వీకరించారు ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో నెల రోజులు కటిక ఉపవాసంలో తీసుకున్న భక్తి భావన దాన గుణాలను ముస్లిం మైనార్టీ సోదరులు జీవితంలో కటిక ఉపవాసం పక్కన పెడితే జీవన విధానంలో వీటిని తూచా తప్పకుండా పాటిస్తే ఎలాంటి అనర్థాలైన తొలగిపోవడంతో పాటు ఆయురారోగ్యాలతో జీవించగలుగుతారని సూచించారు నెలరోజుల అల్లా ప్రార్థనలే ఇంతటి క్రమశిక్షణకు అలవాటు పడితే జీవితాంతం అల్లాను ప్రార్థిస్తూ జీవనం గడిపితే బాగుంటుందని సూచించారు తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కుల మతాలకుఅతీతంగా అన్ని వర్గాలను సమంగా చూస్తూ ప్రజాభివృద్ధి ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తుందని ప్రభుత్వాన్ని ప్రజలు,ప్రజలను ప్రభుత్వాలు బలపరుస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు సార్థకమవుతాయని ఈ సందర్భంగా బొజ్జు పటేల్ అన్నారు ఖానాపూర్ మండల కేంద్రంలోని జామా మజీద్ ప్రాంతంలో గల మొగల్పుర లోని మాజీ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా పరిషత్ కోఫ్షన్ మెంబర్ జమా మజీద్ సదర్ జహీర్ ఖాన్ మూడో వార్డు కౌన్సిలర్ సాజిదా బేగం భర్త జమాల్ కురిషి గృహాలతో పాటు కడం జన్నారం ఇంద్రవెల్లి ఉట్నూర్ మండల కేంద్రాల్లోని పలువురు మైనార్టీ నాయకుల ప్రజాప్రతినిధుల గృహాల్లో వారు ఇచ్చిన రంజాన్ ఆదిత్యాన్ని స్వీకరించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# ఆసాంఘిక కార్యకలాపాలను అణచి వేయాలి

- మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ప్రారంభం
- బోథ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ
- రిబ్బన్ కట్ చేసి నూతన గదిని ప్రారంభించిన మహిళా కానిస్టేబుళ్లు
- ప్రజా సమస్యలను విపిఓ ద్వారా పరిష్కరించేలా చేయాలి
- మండలంలో ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చర్యలు చేపట్టాలి
- గంజాయి, గుడుంబా, రాయితీ బియ్యం, పశువుల అక్రమ రవాణాపై దృష్టి సారించాలి
- విపిఓలు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్






**బోథ్, మార్చి 21 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు, జిల్లా పోలీసు యంత్రాంగం మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను కేటాయిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం బోథ్ పోలీస్ స్టేషన్ నందు మహిళా పోలీసు సిబ్బంది కోసం నిత్యవసర అవసరాల నిమిత్తం ప్రత్యేకంగా నూతన గదిని నిర్మించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పూజా కార్యక్రమాల నడుమ ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుళ్లు సిహెచ్ లైలా, కోవ నవ్య, హోంగార్డ్ జయ శ్రీ లతో ప్రారంభింపజేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని తెలిపారు. మహిళల రక్షణకై షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామస్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సిసిటీవీ కెమెరాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మండల పరిధిలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని అదేవిధంగా గుడుంబా లేకుండా, ప్రభుత్వ రాహితీ బియ్యం అక్రమంగా తరలకుండా, పశువుల రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, మండలంలో ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పోలీసుల పట్ల నమ్మకం పెంపొందించే విధంగా విధుల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. విధులలో నీతి నిజాయితీని కనబరచాలని, అవినీతి చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సిఐ డి గురుస్వామి,బోథ్ ఎస్ఐ వి పురుషోత్తం, బజార్హత్నూర్ ఎస్సై సంజయ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శబరిమాత పాదయాత్రికులకు ఘన స్వాగతం

**భక్తులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న బలరాం జాదవ్**




**నేరడిగొండ, మార్చి 21 (ప్రజా జ్యోతి) :** నేరడిగొండ మండలం ధార్మిక్ నగర్ గ్రామంలో శబరిమాత భక్తుల పాదయాత్ర సందడి నెలకొంది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని లోక కళ్యాణార్థం కామారెడ్డి జిల్లా తాడ్వాయిలోని శబరిమాత ఆలయానికి కాలినడకన అదిలాబాద్ జిల్లా నలుమూలల నుండి బయలుదేరిన భక్తులకు తెలంగాణ రాష్ట్ర అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఘన స్వాగతం పలికారు.

**సేవలో పునీతమైన ధార్మిక్ నగర్ :** ప్రతి ఏటా ఆనవాయితీగా సాగుతున్న ఈ పాదయాత్రలో భాగంగా, ఈసారి కూడా సుమారు 400 మంది భక్తులు బలరాం జాదవ్ నివాసంలో సేదతీరారు. భక్తులందరికీ ఆయన స్వయంగా పండ్లు, ఫలహారాలు మరియు అల్పాహారాన్ని ఏర్పాటు చేసి తన భక్తిని చాటుకున్నారు.

**రామభక్తురాలిగా శబరిమాత విశిష్టత :** ఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ.. శబరిమాత చిన్నతనం నుండే శ్రీరామునిపై అచంచలమైన భక్తిని కలిగి ఉండేదని, రాముని నామస్మరణతోనే పునీతమైందని గుర్తుచేశారు. భక్తులందరూ ఆమె చూపిన ధర్మమార్గంలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులతో కలిసి ఆయన కూడా కొద్దిదూరం పాదయాత్రలో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. ప్రతి సంవత్సరం ఇలా భక్తులకు సేవ చేసే భాగ్యం కలగడం నా పూర్వజన్మ సుకృతం." - బలరాం జాదవ్ తమపై చూపిస్తున్న అభిమానానికి, కల్పించిన సౌకర్యాలకు పాదయాత్రలో ఉన్న భక్తులు బలరాం జాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జై శ్రీరామ్, శబరిమాత నామస్మరణలతో ధార్మిక్ నగర్ వీధులు మారుమోగాయి.

# అండర్-14 జట్లకు కుమ్మరి మల్లేష్, లావణ్య మేనేజర్‌గా ఎంపిక



**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 21 ప్రజా జ్యోతి :** జార్ఖండ్ రాష్ట్రం రాంచి నగరంలో ఈ నెల 23 నుండి 26 వరకు నిర్వహించనున్న 25వ జాతీయ స్థాయి అండర్-14 సెపక్ తక్రా పోటీలకు కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనా మండలం గోలేటి గ్రామానికి చెందిన కుమ్మరి మల్లేష్, కుమ్మరి లావణ్య మేనేజర్లుగా ఎంపికయ్యారు. బాలుర అండర్-14 జట్టుకు మల్లేష్ మేనేజర్‌గా, బాలికల అండర్-14 జట్టుకు లావణ్య మేనేజర్‌గా వ్యవహ రించనున్నారని తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీని వాస్ రెడ్డి తెలిపారు. మల్లేష్, లావణ్య దంపతులుగా ఉండగా, వారి చిన్న కుమార్తె కుమ్మరి శ్రీవల్లి కూడా ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం గోలేటి గ్రామానికి గర్వకారణంగా మారింది. కుమ్మరి మల్లేష్ గతంలో 2005లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన సీనియర్ జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీల్లో పాల్గొన్నారు. అలాగే 2006, 2008 సంవత్సరాల్లో హైదరాబాద్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రిఫరీగా సేవలందించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెపక్ తక్రా సంఘం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2000 నుండి 2026 వరకు కోచ్, రిఫరీగా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా మల్లేష్, లావణ్యలను తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా సంఘం సంయుక్త కార్యదర్శి పి. శిరీష, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కె. భాస్కర్, ఆర్. రామకృష్ణ, కొమురం భీమ్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షుడు ఆర్. నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎస్. తిరుపతి, కమిటీ సభ్యులు పి. సాంబయ్య, పి. సదానందం రెడ్డి, సతీష్, జి. అనిల్ గౌడ్, జి. శ్రీధర్ తదితరులు అభినందించారు.

## ప్రపంచ కవితా దినోత్సవం



**సారంగాపూర్, మర్చి 21, ప్రజా జ్యోతి :**

"ఈ కవితల దోరణి"
రండి మా గుండె
గుమ్మాలకు
తోరణాలుకండి
కవుల కలమెనుక ఉన్న
పదాల బాధను
అతి దగ్గరుండి చూడండి
శబ్దాలను స్పందనలను
వింటూ ...
మానవతా తీరంలో సేద తీర్చుకోండి...

శబ్దాల వెనుక నిశ్చలంగా ఉన్న మౌన సముద్రాన్ని
వాస్తవ జీవన సారాన్ని నిజమైన భావాన్ని చూడండి
ఆవులిస్తూ లేచే ఆలోచనలను
ఆకలిదప్పుల ఆవేదనల అరుపులను
విసిరేసే నిశ్శబ్దాల నిట్టూర్పులను చూడండి!!...

మాలోని ప్రతి అక్షరం
స్వాగతించి సత్కరిస్తుంటాయి
ప్రసరించే అక్షరాల చూపులవెనుక
ఎన్నెన్నో ఉషస్సులు...
ఆత్మీయ ఆలాపనలతో ఆరతి పడుతుంటాయి..

ఎన్నో కలల్ని కవితల్ని వలపుల వలల్ని
విసిరే విరుపుల మడతల్ని చూడండి
మనసు నిశ్శబ్దాన్ని
గుండె చేసే శబ్దాలను వినండి
కన్నీటి లో తడిసిన కవిత్వాన్ని
పట్టి పట్టి చూడండి!!..
అంతరాత్మ అరుపులు ఆలోచన మెరుపులే...

అయినా అనాధ పక్షాన నిలిచే కవిత్వం
అన్నార్తుల్ని రక్షించే పదాల పరుగులను
మీకళ్ళారా చూడండి
మా తత్త్వంపు కాంతిలో మెరిసే భావం
నాటి శిథిలాలల్లోని రుధిర భాష్పాలు...
మహాకాల సిద్ధాంతాలెన్నో
అనంత శూన్యంలో ...
ఆవరించిన అంతర్యాములెన్నో
వివిధ పార్శ్వాలకవిత్వపు సృష్టితో ...
ఓ కొత్త నాగరికతను నిలబెట్టును...

మహా మనుషుల మహిమల్ని మర్మాల్ని
అకుంఠిత దీక్షతో అలుపెరుగని పోరాటంతో
ఉరుమై మెరుపై ధ్వనిస్తు చేదిస్తుంది!!...
నిజాల్ని నిర్ధారించి విజయ కేతనం ఎగిరేస్తుంది...

మనస్సును స్థిరం చేసుకొని
తిమిరం పై సమరం సాగించే
అక్షర సముదాయాన్ని చూడండి
అనంత విశ్వాసాన్ని నింపే ఆలోచన ధోరణి..
మీరే దగ్గరుండి చూస్తారు..
మీలో నిజమైన దోరణి వస్తుంది..

**ప్రపంచ కవితా దినోత్సవ శుభాకాంక్షలుతో**
**అంబటి నారాయణ రచయిత.**
**9849326801**

## ఉపసర్పంచ్ లాహు కుమార్ చొరవతో రహదారి మరమ్మత్తులు



**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 21 ప్రజా జ్యోతి :** వాంకిడి మండలం ఖమన పంచాయతీ పరిధిలోని గొల్లగూడ గ్రామంలో రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు దెబ్బతినడంతో రాకపోకలు కష్టసాధ్యంగా మారాయి. ఈ సమస్యపై సమాచారం అందుకున్న గ్రామ ఉపసర్పంచ్ లోబడే లాహు కుమార్ వెంటనే స్పందించారు. గ్రామంలో గుంతలు ఉన్న ప్రాంతాలను పరిశీలించి, తక్షణ చర్యలు చేపట్టారు. ఇసుక వేయించి గుంతలను పూడ్చే పనులు నిర్వహించారు. దీంతో గ్రామ ప్రజలకు కొంతవరకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ లాహు కుమార్ మాట్లాడుతూ, గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఉపసర్పంచ్ చొరవను అభినందిస్తూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు




**జన్నారం, మార్చ్ 21 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో శనివా రం రోజున రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన ఈద్గాల వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేశారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, నెలకొనాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్తించారు. ఒకరికొకరు అలయ్ బలయ్ చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముప్పై రోజులు కఠోర దీక్ష ,కఠోర నియమాలు, ఉపవాసాలు పాటించారు. మండల కేంద్రంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మారం వెళ్లే రహదారి ప్రక్కన ఉన్న ఈద్గా వద్దకు పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్,జన్నారం మాజీ సర్పంచ్ నందు నాయక్ లు వెళ్లి ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సిర్సనగండ్ల రామచంద్రుని సేవలో మంత్రి జూపల్లి

- బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ.. ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

నాగర్ కర్నూల్ మార్చ్ 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల క్షేత్రం శనివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించి సీతారామచంద్రస్వామి





వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, దేవస్థాన అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.మంత్రి జూపల్లి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ నెల 26 నుంచి జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాల గోడపత్రికను (పోస్టర్) ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న వివిధ మౌలిక సదుపాయాల కల్పన పనులకు మంత్రి భూమిపూజ చేశారు.

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తున్నామని, సిర్సనగండ్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (ప్రజాజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా వనపర్తి పట్టణంలోని గోపాల్పేట రోడ్‌లో ఉన్న ఈద్గా వద్ద శనివారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం సోదరులకు



రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రంజాన్ మాసమంతా ఉపవాస దీక్షలతో నిష్ఠగా ప్రార్థనలు చేసే ముస్లిం సోదరులు, పండుగ రోజున ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ నిర్వహించడం విశేషమన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ ఈ పండుగలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసుకోవడం ఐక్యతకు మారుపేరని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పీసీసీ సభ్యులు తైలం శంకర్ ప్రసాద్, వనపర్తి మండలం మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం మండల నాయకులు సాయి చరణ్ రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షులు ఆదిత్య, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సేవా పురస్కారం అందుకున్న మేడం రామకృష్ణ

గద్వాల మార్చి 22(ప్రజా జ్యోతి ప్రతినిధి): హైదరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి వ్యాపార నెట్‌వర్క్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కార్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జోగుళాంబ గద్వాల జిల్లా కు చెందిన తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణకు "పద్మశాలి సేవా పురస్కారం"ప్రదానం చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, సినీ నటుడు బాబు మోహన్,తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాట్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా మేడం రామకృష్ణ అవార్డును స్వీకరించారు.ఈ సందర్భంగా మేడం రామకృష్ణ మాట్లాడుతూ,గత 10–12 సంవత్సరాలుగా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, పద్మశాలి సమాజ అభివృద్ధి కోసం చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.తాను చేపట్టిన ప్రతి కార్యక్రమంలో చేనేత కార్మికులు,సంఘ నాయకులు,సహకార సంఘాల అధ్యక్షులు అందరూ తోడ్పాటు అందించారని,ఈ అవార్డు అందుకోవడంలో వారి సహకారం కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తనకు సహకరించిన చేనేత కార్మిక సోదరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ,భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు,తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రతినిధులు,పద్మశాలి వ్యాపార నెట్‌వర్క్ సంస్థ సభ్యులు,రాజకీయ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# ఏళ్ల నాటి సొంతింటి కల నెరవేరింది

- ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదలకు కొత్త ఆశలు
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (ప్రజాజ్యోతి) : వనపర్తి పట్టణంలో పేద కుటుంబాల సొంతింటి కలలు నెరవేరుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి పట్టణంలోని 15వ వార్డుకు చెందిన దీపిక–ఉపేందర్ దంపతులు, అలాగే 21వ వార్డు మేఘ్యు తాండాకు చెందిన దన్ సింగ్, చిట్టెమ్మలు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తమ నూతన గృహాలను నిర్మించుకుని గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై, లబ్ధిదారులను అభినందిస్తూ నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇంటి కోసం కలలు కనడం జరిగిందని, కానీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక అద్దె ఇళ్లలోనే జీవనం సాగించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో తమ కల సాకారమైందని ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి పేదల



సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, స్థానిక ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎల్లప్పుడూ పేదల సమస్యలపై దృష్టి సారించే నాయకుడని, ఆయన సహకారంతోనే ఇంటి నిర్మాణం త్వరగా పూర్తయ్యిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు సౌమ్య రాఘవేంద్ర, ధనలక్ష్మి , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సురేష్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం మండల కాంగ్రెస్ నాయకులు సాయి కిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.v

# రంజాన్ పండుగ సామరస్యానికి ప్రతీక:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాలలో ఘనంగా ఈద్ ప్రార్థనలు

గద్వాల మార్చి 22(ప్రజా జ్యోతి ప్రతినిధి): రంజాన్ పండుగ శాంతి,సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని,అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించడానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ గౌరవం,సేవాభావం,దాన గుణాన్ని పెంపొందించే పవిత్ర మాసమని తెలిపారు.

హిందువులు,ముస్లింలు సహా అన్ని మతాల ప్రజలు సఖ్యతతో జీవిస్తూ సమాజంలో ఐక్యత,సామరస్యాన్ని కాపాడాలని సూచించారు.భవిష్యత్తులో కూడా ఇదే ఐక్యత నాలని ఆకాంక్షించారు.అన్ని కులాలు,మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసిమెలిసి జీవించేందుకు రంజాన్ పర్వదినం దోహదపడుతుందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని పలువురు ముస్లిం సోదరులు సన్మానించి ఈద్





రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం గద్వాల ఈద్‌గాహ్ వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,రంజాన్ పరస్పర కొనసాగిస్తూ జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ,నెల రోజులపాటు ముస్లిం సోదరులు ఆచరించిన ఉపవాస దీక్షల ఫలితంగా అల్లా దీవెనలతో ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొ శుభాకాంక్షలు తెలిపారు.అంతకుముందు ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ సందేశాన్ని వినిపించారు.ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి ,వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు,ముస్లిం మైనారిటీ సంఘాల ప్రతినిధులు,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# "అంకెల గారడీ బడ్జెట్... సంక్షేమం మాయమైపోయింది!"

- ఈ బడ్జెట్ అన్ని వర్గాలను నిరాశపరిచింది.! : బడ్జెట్‌పై మాజీ మంత్రి విరసనోళ్ళ శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ మార్చి 20 ( ప్రజా జ్యోతి బ్యూరో ) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌పై మాజీ మంత్రి విరసనోళ్ళ శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బడ్జెట్ అన్ని వర్గాలను నిరాశపరిచిందని, మూడు బడ్జెట్లు పూర్తయినా ఒక్క వర్గానికీ న్యాయం జరగలేదని ఘాటుగా విమర్శించారు. పాత మోతి నగర్ కార్పొరేటర్ సిద్ధిఖీ నివాసం లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మూడో బడ్జెట్‌లో అయినా సంక్షేమ పథకాలపై దృష్టి పెడుతుందని ప్రజలు ఆశించారని, కానీ ఆ ఆశలను పూర్తిగా వమ్ము చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 11 డిక్లరేషన్‌లకు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలు బడ్జెట్‌లో కనిపించలేదని ఆరోపించారు. బీసీలకు ఏడాదికి రూ.20 వేల కోట్లు, ఐదేళ్లలో లక్ష కోట్లు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, కేవలం 3.85 శాతం మాత్రమే కేటాయించడం దారుణమని, అందులోనూ రూ.5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయడం బీసీలను మోసం చేయడమేనని అన్నారు. బీసీ గురుకులాల్లో సరైన ఆహారం లేక విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని, మైనారిటీ గురుకులాల్లో వసతుల లోపంతో విద్యార్థులు వెళ్లిపోతున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి మాట తప్పారని, పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వడం లేదని, పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ కూడా నిలిపివేస్తున్నారని విమర్శించారు.రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని పేర్కొంటూ, రైతు బంధు అమలు సరిగా లేదని, కరెంటు సరఫరా లోపాలు, యూరియా కొరత, పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులు, గురుకులాలు, మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రులు విస్తృతంగా అభివృద్ధి చెయ్యడంతో రాష్ట్ర సంపద పెరిగిందని, ప్రజల ఆస్తుల విలువలు పెరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ అభివృద్ధి దిశగా రాష్ట్రం సాగుతోందా లేదా వెనక్కి వెళ్లుతోందా అన్నది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు.బీసీలకు రూ.50 వేల కోట్లు, దళితులకు రూ.10 లక్షల పథకానికి తగిన బడ్జెట్ కేటాయించాలని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రత్యేక సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక సమానత్వం ఇంకా అందలేదని అన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని తిరోగమన దిశగా నెడుతోందని, ఇది సంక్షేమ బడ్జెట్ కాదని, కేవలం అంకెల గారడీ




మాత్రమేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఒత్తిడి తెచ్చి, అన్ని వర్గాలకు నిజమైన సంక్షేమ ఫలాలు అందించేలా బడ్జెట్ రూపకల్పన చేయించాలని కోరారు. ఈ సమావేశంలో మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్, కార్పొరేటర్లు సిద్ధికి, లక్ష్మి నరేష్, మాజీ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# గట్టు చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

గట్టు మార్చి 22(ప్రజా జ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇటీవల జరిగిన





సర్పంచ్, వార్డు మెంబర్,మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికల్లో విజయం సాధించిన చేనేత వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులను గట్టు చేనేత సహకార సంఘం ఘనంగా సన్మానించింది.శనివారం ఉదయం గట్టు మండల కేంద్రంలోని రైతు వేదికలో సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సంఘ సభ్యులు,చేనేత కార్మికుల సమక్షంలో ఎన్నికైన కౌన్సిలర్లు,వార్డు మెంబర్లకు సన్మానం చేశారు.గద్వాల మున్సిపాలిటీ 21వ,వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్,ఆరగిద్ద గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎం.డి.రఫీ,వార్డు మెంబర్ జి.విరుపాక్షి,గొర్ల ఖాన్ దొడ్డి గ్రామానికి చెందిన ముని స్వామి,తిరుపతి,మాచర్ల గ్రామానికి చెందిన పి.జి.శంకరమ్మ,కనికె వెంకటేష్, రాజోలి గ్రామానికి చెందిన వంక మహేష్,సిరిసాల మధు,గొరకల్లు వీరేష్,చాంద్ పాషా, మల్లెంపల్లె గ్రామ ఉప సర్పంచ్ మాచాని తిమ్మప్ప,వార్డు మెంబర్ పూజారి రమేష్, సిందనూర్ గ్రామానికి చెందిన వినోద్ తదితరులను సన్మానించారు.ఈ కార్యక్రమం

ఆప్కో మాజీ డైరెక్టర్,గట్టు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దోమ వీరన్న అధ్యక్షతన జరిగింది.సంఘ కార్యవర్గ సభ్యులు కూనె చంద్రశేఖర్,బుదారపు లక్ష్మీనారాయణ, సిరసాల నాగరాజు,కూనె శంకరప్ప,బుదారపు అయ్యప్ప,మల్లెంపల్లి లక్ష్మీనారాయణ, బుదారపు చంద్రశేఖర్,గోరంట్ల గోవిందు,జేరుబండి జయన్న,మెడికల్ జయన్న తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పులిపాటి వెంకటేష్ మాట్లాడుతూ,విజేతలను ఘనంగా సన్మానించడం శుభపరిణామమని,చేనేత వర్గం ఐక్యతతో ముందుకు సాగాలని అన్నారు."పోగు బంధాన్ని బలపరచుకుందాం–ఐక్యతను చాటుకుందాం"అనే నినాదంతో చేనేత వర్గం బలమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.రాబోయే ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ఐక్యతను ప్రదర్శించాలని సూచించారు.

# పండుగ వేళ కట్టుదిట్టమైన భద్రత - ప్రజలకు ఎస్పీ జానకి శుభాకాంక్షలు

- ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన -
శాంతి, సామరస్యానికి పిలుపు

మహబూబ్‌నగర్, మార్చి 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ) పవిత్ర రంజాన్ మాసం ముగింపులో ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ దరావత్ జానకి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఈద్గాల వద్ద ఎస్పీ ఆదేశాల మేరకు





పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రార్థనలకు హాజరైన చిన్నారులు, భక్తులకు "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పర్వదినాన్ని శాంతి, సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని, పండుగ సందర్భంగా నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర రంజాన్ పర్వదినం అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వం నింపాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# శ్రీ స్వయంభూ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్ కుటుంబం

మల్దకల్ మార్చి 21(ప్రజా జ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో శనివారం శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించుకున్నారు.ఇటీవల ఆయన





కుమారుడి వివాహం కావడంతో వారితో కలిసి దేవాలయానికి రాగా దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు,అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకి స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, బాబురావు,చంద్రశేఖర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# మల్దకల్ మండలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం

43 పశువులకు ఉచిత టీకాలు

మల్దకల్ మార్చి 21(ప్రజా జ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్ మండలంలో పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాల కార్యక్రమం మార్చి 10 నుండి ఏప్రిల్ 09 వరకు నిర్వహించబడుతోంది.ఇందులో భాగంగా శనివారం మల్దకల్ మండలంలోని బూడిదిపాడు గ్రామంలో ఉచిత టీకాల శిబిరం విజయవంతంగా నిర్వహించారు.ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ టి.కృష్ణారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా పాలవాయి పశు వైద్య అధికారిణి డా.ఉష మాట్లాడుతూ,గాలికుంటు వ్యాధి లక్షణాల గురించి వివరించారు.ఈ వ్యాధి వచ్చిన పశువుల నోటిలో మరియు గిట్టల మధ్య పుండ్లు రావడం,నోటి నుంచి ద్రవం కారడం,మేత తినకపోవడం,జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు.కొన్ని సందర్భాల్లో పశువులు మరణించే అవకాశమూ ఉందని హెచ్చరించారు.కాబట్టి పశుపోషకులు ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా తమ పశువులను రోగాల బారి నుంచి రక్షించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 41 గోవులు,2 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ,పశుపోషకులు అందరూ తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పశుపోషకులు,పశువైద్య సిబ్బంది మధు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ప్రభుత్వం మొండి చేయి..?

- కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అన్నదాత వ్యతిరేకి
- టిఆర్ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్



**ఎల్కతుర్తి మార్చ్ 21 (ప్రజాజ్యోతి) :** తెలంగాణలో 60 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నప్పటికీ 2026-27 బడ్జెట్లో రైతులకు ప్రజా ప్రభుత్వం అని పేర్కొనే కాంగ్రెస్ సర్కార్.. అన్నదాతలకు మొండి చేయి చూపించిందని ఎల్కతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ తీవ్రంగా తప్పుపట్టారు. గత సంవత్సరం 2025 - 26 బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ. 24, 439 కోట్లు కేటాయించగా, 2026-27లో ఇది రూ. 23, 179 కోట్లకు తగ్గిందని గత సంవత్సరం కంటే సుమారు రూ.12,60 కోట్లు తక్కువగా ఉండటాన్ని తప్పు పట్టారు. ఈ కోతలు రైతుల సంక్షేమాన్ని ప్రభావితం చేస్తాయని భాస్కర్ అక్షేపించారు. రైతుల సమస్యలు పంట బీమా, రైతు భరోసా, ఇరిగేషన్ వంటి కార్యక్రమాలకు ఇప్పటికే నిధుల ఆలస్యం ఉందని చెప్పారు. తమది రైతు సంక్షేమ సర్కారు అనే పేర్కొనే రేవంత్ ప్రభుత్వం.. వ్యవసాయ నిధులను పెంచాలని రైతు భరోసా వంటి పథకాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేసింది. బడ్జెట్ పట్ల ప్రజలలో నెలకొన్న ఈ అసంతృప్తి రైతుల్లో కొత్త అల్లర్లకు దారి తీయవచ్చు అని భాస్కర్ హెచ్చరించారు.

## ఈద్ ముబారక్ తెలిపిన ఇనగాల





**పరకాల, మార్చి 21, (ప్రజా జ్యోతి) :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరియు వరంగల్ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరకాల పట్టణంలోని ముస్లిం సోదరులకు హృదయపూర్వక 'ఈద్ ముబారక్' తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ పండుగ మానవాళికి శాంతి, ప్రేమ మరియు త్యాగ నిరతిని చాటిచెబుతుందని కొనియాడారు. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆచరించిన ఉపవాస దీక్షలు సమాజంలో క్రమశిక్షణను, పేదలకు చేసే దానధర్మాలు సామాజిక సమానత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వంలో తెలంగాణలో మత సామరస్యం వెల్లివిరుస్తోందని, నియోజకవర్గ ప్రజలందరూ ఐక్యంగా పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. సమాజంలో శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సెలర్లు, మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి



**నర్సంపేట మార్చి 21 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట డివిజన్ లోని 300 మంది సభ్యులకు సి ఏం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి. వివిధ కారణా లతో దావకానలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న 300 మంది సభ్యులకు కోటి పది లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ 300 మంది కి ఒక కోటి పది లక్షల చెక్కులను అందించినట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెండం లక్ష్మీ రామానంద్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ నర్సంపేట పట్టణ అధ్యక్షులు రాజేందర్ కౌన్సిలర్ పొన్నం నరసింహారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్

పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్



**నర్సంపేట మార్చి 21 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ,26వ వార్డులో విద్యుత్ అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్,వైస్ ఛైర్మన్ గంధం నరేందర్ గుప్తా,ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సహకారంతో, గృహ అవసరాలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా నూతన ట్రాన్సార్మర్లను ప్రారంభించడం జరుగుతుందని.పాత ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడటం వల్ల వచ్చే లో-వోల్టేజ్ సమస్యలను అరికట్టడానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్లు దోహదపడతాయని అని అన్నారు.విద్యుత్ శాఖ అధికారులు మున్సిపాలిటీ పరిధిలో నాణ్యమైన విద్యుత్ అందించాలని,ప్రజలకు అంతరాయం లేని సరఫరా ఉండేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ హనుమకొండ శ్రీధర్, మండల శ్రీదేవి శ్రీనివాస్,పొన్నాల మనిషా ప్రకాష్,బాణాల ప్రసన్న శ్రీనివాస్,శ్రీరామోజు రోజా రాణి,ఇస్లావత్ రామ గోపి, వేల్పుల శ్రీలత,విద్యుత్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు డబుల్ ఇళ్లు

- 17 కుటుంబాలకు పట్టాల పంపిణీ • ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి • ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 21, (ప్రజాజ్యోతి) :** అభివృద్ధి కార్య క్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, వాటి వల్ల నష్టపోయే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో భద్రకళీ ఆలయ అభివృద్ధి పనులలో భాగంగా మాడ వీధుల నిర్మాణం కారణంగా ఇళ్లను కోల్పోతున్న భూ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగల వెంకట్రాం రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి ఎమ్మెల్యే డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలను అందజేశారు. భద్రఖాళీ ఆలయ అభివృద్ధి అనేది ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ముఖ్య అంశమని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని తెలిపారు. మాడ వీధుల నిర్మాణంతో ఇళ్లను కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుమారు 17 కుటుంబాలు స్వచ్ఛందంగా తమ స్థలాలను అప్పగించడం అభినందనీయ మని కొనియాడారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఇళ్లను కోల్పోయిన ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించడమే కాకుండా ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉపాధి అవకాశాలు కూడా కల్పించామని తెలిపారు. ఎటువంటి రాజకీయ దురుద్దేశాలు లేకుండా ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా కొనసాగిస్తూ ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

# హామీలు గాల్లో -కేటాయింపులు కాగితల మీదే

- మహిళసాధికారత మాటల్లోనే -బడ్జెట్‌లో కనిపించదు
- అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య (ఏఐఎఫ్డి డబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల.రాగసుధ



**నర్సంపేట మార్చి 21 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ మహిళల సంక్షేమానికి తీవ్రమైన అన్యాయం చేసిందని, ఈ బడ్జెట్ పూర్తిగా మహిళా వ్యతిరేక బడ్జెట్ అని దీనిని అఖిల భారత ప్రజాతంత మహిళా సమైక్య (ఏ ఐ ఎఫ్ డి)రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అఖిల భారత ప్రజతంత్ర మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల. రాగసుధ అన్నారు.ఈ సందర్భంగా వంగల. రాగసుధ మాట్లాడుతూ,మహిళల కోసం కేటాయించాల్సిన నిధులు గణనీయంగా తగ్గించబడ్డాయని, మహిళా సంక్షేమ పథకాలకు సరిపడా నిధులు కేటాయించకుండా,కేవలం ప్రకటనలకే పరిమితం కావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని, మహిళల ఉపాధి, ఆరోగ్యం, భద్రత, విద్య వంటి కీలకరంగాల్లో స్పష్టమైన ప్రణాళికలు లేకపోవడం ఈ బడ్జెట్ వైఫల్యాన్ని బయటపెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్ర మొత్తం బడ్జెట్‌లో మహిళలకు కేటాయించిన భాగం సుమారు 8%--10% మాత్రమేనని, ఇది జనాభాలో మహిళలు దాదాపు 50% ఉన్న నేపథ్యంలో చాలా తక్కువని,మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు కేటాయింపు గత సంవత్సరం తో పోలిస్తే పెరుగుదల కేవలం 3%--5% మాత్రమేనని,ఇది ద్రవ్యోల్బణం కంటే కూడా తక్కువని అన్నారు. మహిళల భద్రత కోసం కీలకమైన షీ టీమ్స్, పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కేటాయింపులు తగ్గడం గమనార్హం అన్నారు. ఆంగన్‌వాడీ, ఆశా వర్కర్ల వేతనాల పెంపు గురించి స్పష్టమైన ప్రస్తావన లేకపోవడం మహిళా కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్వయం సహాయక సంఘాలకు (DWCRA) అందించాల్సిన నిధుల్లో గణనీయమైన పెరుగుదల లేకపోవడం గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు అడ్డంకిగా మారుతుందని, మహిళల ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక పథకాలపై కొత్తగా పెద్దగా కేటాయింపులు లేవని, ఈ బడ్జెట్ వల్ల మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదని,,ముఖ్యంగా: గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం, కార్మిక మహిళల ఆదాయం స్థిరంగా ఉండకపోవడం భద్రతా లోపాలు కొనసాగడం పోషణ, ఆరోగ్య సేవలలో లోటని అన్నారు.రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 30% మహిళల కోసం ప్రత్యేక కేటాయింపులు చేయాలని, మహిళా కార్మికులైన ఆంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు గౌరవ వేతనం పెంచాలని,మహిళల భద్రత కోసం ప్రత్యేక నిధుల కేటాయించాలని, స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ రుణాలు, సబ్సిడీల పెంపు మహిళా ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక పథకాలు తేవాలని అన్నారు.మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే విధానాన్ని ప్రభుత్వం విడనాడాలని, గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయని -- ఈ బడ్జెట్ మహిళల అభివృద్ధికి కాదు, వారి నిర్లక్ష్యానికి ప్రతీక అని, మహిళల హక్కుల కోసం, సమాన హక్కుల కోసం పోరాటం మరింత బలపడాల్సిన అవసరం ఉందని, "సమాన హక్కులు -- సముచిత బడ్జెట్ -- మహిళల సాధికారత!"అని అన్నారు.

## రంజాన్ పండుగను పురస్కరించుకుని.. ఈద్గా నందు ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్న నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి







**నర్సంపేట మార్చి 21 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డు శివారులోనీ ఈద్గా నందు... ముస్లిం మత పెద్దలు ఆహ్వానం మే రకు..పవిత్రమైన రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు,ప్రార్ధనలు మనసును పవిత్రం చేసుకోవడానికి,మంచి మార్గంలో నడవడానికి దోహదపడతాయని అన్నారు. మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యా అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. కులమతాలకు అతీతంగా, నిరుపేద ముస్లింలకు అత్యధిక ఇంద్రమ్మ ఇండ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం సోదరులు చేసే ప్రతి ప్రార్ధనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని వారు ఆకాంక్షించారు.అనంతరం ఈద్గా నందు 50 లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించబడిన సిసి రోడ్డు & సిసి ఫ్లాట్ ఫామ్ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని వారు ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్,పట్టణ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ అనుబంధ సంఘ నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# సైడ్ కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి

పర్వతగిరి సర్పంచ్ పాలకవర్గం సూచనలు బేఖాతర్ ..


ప్రజాజ్యోతి
19 Feb 2026 - Page 6
సైడ్ కాలువల పై నిర్మాణాలు తొలగించాలి
- పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్





**పర్వతగిరి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి గ్రామం లో సైడ్ కాలువలపై పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై గ్రామపంచాయతీ కఠిన వైఖరి తీసుకుంది. గ్రామంలోని పలు ప్రాంతాల్లో కొందరు నివాసి తులు తమ ఇళ్ల ముందున్న కాలువలపై సీసీ ఫ్లాట్‌ఫామ్‌లు నిర్మించడం, మరికొందరు కాలువల పరిమితిని దాటి శాశ్వత నిర్మాణాలు చేపట్టడం అధికారులు గుర్తించారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహం ఆగిపోవడంతో కాలువల్లో నీరు నిల్వ ఉండి తీవ్ర పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దుర్వాసన, దోమల పెరుగుదల, వ్యాధుల వ్యాప్తి వంటి సమస్యలు గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ చీదురు శంకర్ మాట్లాడుతూ సైడ్ కాలువలపై నిర్మించిన సీసీ ఫ్లాట్‌ఫామ్‌లు, ఇతర నిర్మాణాలను ప్రజలు స్వచ్ఛందంగా వెంటనే తొలగించాలని సూచించారు. కాలువలను పూర్తిగా మూసివేయకుండా ఓపెన్ చేసి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పూర్తిగా తొలగించలేని పరిస్థితుల్లో కనీసం 3 అడుగుల వెడల్పు, 4 అడుగుల దూరంతో ఓపెనింగ్ ఏర్పాటు చేసి శుభ్రపరిచే అవకాశం కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా, రెండు రోజుల గడువు ఇచ్చిన అనంతరం కూడా స్పందించని వారిపై గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యక్షంగా చర్యలు తీసుకుని కాలువలపై ఉన్న సీసీ నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్, పాలకవర్గం సూచనలు వెలువడినప్పటికీ గ్రామంలో కొందరు వాటిని పట్టించుకోకుండా కొత్తగా రోడ్డు ఇరువైపులా నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఆదేశాలు ఉన్నా అమలు ఎందుకు లేదు? కొంతమందికి ప్రత్యేక సడలింపులా? అనే ప్రశ్నలు గ్రామ ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆలస్యం వెనుక ఏదైనా కారణం ఉందా అన్న సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. గ్రామ ప్రజలు కోరుతున్నది ఒక్కటే రోడ్డు ఇరువైపులా ఉన్న సైడ్ కాలువలపై అన్ని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించాలి, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర చాలి, కాలువలు కప్పేస్తే గ్రామం మునిగేస్తుంది. అధికారులు చూస్తూ ఉంటే ప్రజలే నష్టపోతారు అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఈద్గాలను సందర్శించి పోలీస్ కమిషనర్



**హనుమకొండ జిల్లా ప్రతినిధి మార్చి 21, (ప్రజా జ్యోతి):** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం హన్మకొండ లోని బొక్కల గడ్డ, పోతన నగర్ ఈద్గాలను ను సందర్శించి రంజాన్ ప్రార్ధనలను సజావుగా జరిగేందుకు పోలీస్ అధికారుల చేపట్టిన భద్రత ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ స్థానిక ఏ.ఎస్పీ శుభం,ఏసీపీ నర్సింహా రావు, ఇతర పోలీస్ అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

## ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన సునీల్ కుమార్

ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్




**పరకాల, మార్చి 21, (ప్రజా జ్యోతి) :** పవిత్ర రంజాన్ సందర్భంగా పరకాల పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. శాంతి, సోదరభావానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యంతో నిర్వహిస్తోందన్నారు. అలాగే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో ముస్లింలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. వారితోపాటు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఏకు దివ్య-విద్యాసాగర్, పట్టణ అధ్యక్షులు, 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యాడ శ్రీనివాస్, పరకాల మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా అనిత-రామక్రిష్ణ, కౌన్సిలర్లు గూడెల్లి సదన్, బండి శ్రీధర్,పాలకుర్తి శ్రీనివాస్, అల్లె దశరథం, సమన్వయ కమిటీ సభ్యులు మేరుగు శ్రీశైలం,పసుల రమేష్,పొరండ్ల వేణు,మడికొండ శీను,మడికొండ సంపత్,ఒంటెరు శ్రావణ,ఎండీ రంజాన్ అలీ,జాఫర్ రిజ్వి,మంద నాగరాజు,పబ్బ శీను కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశలకు కనీస వేతనం ఇవ్వాలి

- పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి
- పట్టణంలో ఆశాలు భారీ ప్రదర్శన
- ప్రభుత్వ స్పందించకుంటే నిరవధిక సమ్మె చేస్తాం
- బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు



**నర్సంపేట మార్చి 21 (ప్రజాజ్యోతి) :** నర్సంపేట ఆశాలకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కనీస వేతనం 18 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామీణ ఆశా వర్కర్స్ యూనియన్ (బిఆర్‌టియు అనుబంధ) సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుండి వరంగల్ అమరవీరుల స్థూపం వరకు ఆశా వర్కర్లు భారీ ప్రదర్శన నిర్వహించి అమరవీరుల సుఖం దగ్గర రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు, ఆశాల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోనె యువరాజులి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా, మేనిఫెస్టోలో పెట్టిన 18 వేల రూపాయల వేతనం ఫిక్స్ డ్‌గా ఇస్తామని చెప్పి మాట తప్పిందని ఆశ వర్కర్లు రెండు సంవత్సరాలుగా వేచి చూసి మూడు బడ్జెట్లో ప్రవేశపెట్టాక ప్రభుత్వం మీద నమ్మకం పోయి రోడ్ల మీదికి వచ్చారని ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశాల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి నిధులు కేటాయింపు చేయాలని పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని పారితోషికం లో లేనటువంటి పనులను ఆశాలతో వైద్య అధికారులు చేపిస్తున్నారని జాబ్ చార్ట్ ప్రకారం పనులు చేపించాలని లేదంటే ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని మంగళవారం రోజున కలెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తామని అయిన స్పందించకపోతే అసెంబ్లీ ముట్టడి చేసి నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత జిల్లా కార్యదర్శి సంధ్య నాయకులు సాలమ్మ సంధ్య అనిత వసుమతి రామ సునీత మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## ఆలేరులో రంజాన్ పర్వదిన వేడుకలు

**– ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**





**ఆలేరు మార్చి 21 ప్రజాజ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో నిర్వహించిన రంజాన్ పర్వదిన వేడుకల్లో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన నిర్వహించి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో సౌరతత్వం ఐక్యత మరియు బలపడాలని ఆకాంక్షిస్తూ అన్ని మతాల ప్రజలు కలిసి శాంతి సామరస్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎజాస్, మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ ఆంజనేయులు, కౌన్సిలర్ లు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**ఆలేరు మార్చి 21 ప్రజాజ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం తూర్పు గూడెం గ్రామానికి చెందిన  గీత కార్మికుడు గోడిసెల యాదగిరి రోజువారి వృత్తిరిత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో కాలుజారి కింద పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎటువంటి ప్రాణాలు లేదని డాక్టర్లు తెలిపారు. ప్రభుత్వం ఎగ్జిబిషన్ మంజూరు చేయాలని కళ్ళు గీత కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ఆలేరు మార్చి 21 ప్రజాజ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని తేర్యాల గ్రామంలో 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ మంత్రి లత స్వామి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాజా మోహన్,ఓ బీసీ సెల్ నాయకులు కంచర్ల శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## పోచంపల్లిలో కుల వ్యతిరేక సంఘం "డైరీ ఆవిష్కరణ"



**భూదాన్ పోచంపల్లి, మార్చి 21 (ప్రజాజ్యోతి) :** పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కుల వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ కె. భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుల వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి యాదగిరి మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించి దాదాపు 73 సంవత్సరాలు గడిచినప్పటికీ దేశంలో కుల వివక్ష ఇంకా పూర్తిగా నిర్మూలం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వ భావన బలపడాల్సిన అవసరం ఉందని, ప్రతి భారత పౌరుడు కుల, మత భేదాలు లేకుండా ఒకరిని ఒకరు సమానంగా గౌరవించినప్పుడే నిజమైన సమసమాజం స్థాపన సాధ్యమవుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా, కుల వివక్ష నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని, సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోతాగళ్ల రామచంద్రం, బడుగు రాజన్ బాబు, గుర్రు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## చదవాలిరా చిన్నా... చదవాలిరా..! చదువే మీ భవిష్యత్ ఆయుధం!

**– విద్యార్థుల్లో జ్వాల రేపిన బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న**



**తుంగతుర్తి, మార్చి 21,(ప్రజా జ్యోతి) :** విద్యే మనిషి జీవితాన్ని మార్చే శక్తి అని పేర్కొంటూ బహుజన యుద్ధనౌక విద్యార్థులను ఉద్దేశించి భావోద్వేగపూరితంగా ప్రసంగించారు. శనివారం మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహనీయులు జ్యోతిబాపూలే, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదవాలిరా.. చిన్నా... చదవాలిరా..!చదువే మీకు నిజమైన ఆయుధం అంటూ విద్య ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. పేదరికం, సామాజిక అసమానతలను అధిగమించాలంటే చదువు తప్ప మరొక మార్గం లేదని అన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల ఆశలు, గురువుల కృషి వృథా కాకుండా విద్యార్థులు తమ బాధ్యతను గుర్తుంచుకోవాలని సూచించారు. చదువు ద్వారా సమాజంలో గౌరవం, స్వాభిమానం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు సోమన్న మాటలు, పాటలతో  ప్రేరణ పొంది, మరింత కృషి చేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు.

## ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు





**తుంగతుర్తి, మార్చి 21, (ప్రజా జ్యోతి) :** మండల వ్యాప్తంగా ముస్లింలు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా జరుపుకునే ఈద్ – ఉల్–ఫితర్ (రంజాన్) పర్వదిన వేడుకలను శనివారం ఘనంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలందరూ స్థానిక ఈద్గాలో ఉదయమే సామూహిక ప్రార్థనలు చేశారు, నెల రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలు నేడు పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు మౌలానా అబ్దుల్ ఆహాద్ మాట్లాడుతూ... క్రమశిక్షణ, దైవచింతన, దానగుణంతోపాటు ఇతరుల పట్ల ప్రేమ దయ జాలి చూపించే దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు.కులమత బేధాలు లేకుండా అందరం ఐక్యంగా ఉంటూ సోదర భావంతో ముందుకెళ్లాలని కోరారు, ఈ సందర్భంగా లోక కళ్యాణం కోసం శాంతి సౌభాగ్యాల కోసం ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక దువా చేశారు, ఖురాన్ పఠనం గావించి నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాలో ముస్లింల ప్రార్థనలతో సందడిగా మారింది, ఈ కార్యక్రమంలో మజీద్ నూర్ కమిటీ అధ్యక్షులు ఎండి జాన్, ఉపాధ్యక్షులు ఎస్కే లాల్, మైనారిటీ యూత్ కమిటీ అధ్యక్షులు ఎస్కే నజీర్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్, కార్యదర్శి ఎస్కె కరీం, సభ్యులు నజీర్, శాలం, సిద్ధిక్, సమీర్, మహబూబ్ అలీ, ఫజిలుద్దీన్, వహీద్, అఫ్జల్, ఎస్కే జానీ మియా, అలీ సాబ్, ఉస్మాన్, అక్రమ్, షరీఫ్, హాఫీజ్, అన్వర్, మీరా సాబ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్లపై అపోహాలు సృష్టిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

- **కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగాపురం మల్లేష్**



**ఆలేరు మార్చి 21 ప్రజాజ్యోతి :** గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఏ రోజు మండల కేంద్రం గురించి గానీ పట్టించుకోక మండల కేంద్రంలోని 950 సర్వే నెంబర్లు గల ఇండ్లపై హైడ్రా ప్రయోగిస్తున్నారని అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజల మధ్య లేనిపోని అపోహాలు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగాపురం మల్లేష్ మండిపడ్డారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు అసెంబ్లీలోనే ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఐలయ్య  ప్రొవిబిషన్ గురించి ప్రస్తావించి గ్రామ కంఠంలో ఉన్న ఇల్లు నిర్మించుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్థానిక ఆర్డిఓ ప్రభుత్వ అధికారులు కూడా ఇట్టి ప్రొబిషన్ విషయంపై ఇటువంటి అపోహాలు చదవద్దని ప్రజలకు వివరణ ఇచ్చారు. ఈ మధ్యకాలంలో మాలుగడ్డ చౌరస్తానందు భూముల విలువలు మరియు ప్లాట్ల విలువలు విపరీతంగా పెరిగినందున జీవించుకొని బిఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేసి 950 సర్వే నెంబర్ల గల ఇండ్లను కూలగొడతారని అసత్య ప్రచారాలు చేసి ప్రజల మధ్య అపవాలు సృష్టించి ప్లాట్ల మార్కెట్ విలువను రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈమధ్య జరిగిన స్థానిక ఎలక్షన్లో మండలంలోని మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొని అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్న మండలాన్ని చూసి తట్టుకోలేక పట్టుమని పదిమంది లేని బిఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గు చేటు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ కొంత మోహన్ రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ సుబ్రహ్మణ్యం, నాయకులు భూమండ శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, పట్టణ అధ్యక్షులు బుగ్గ కొమరయ్య, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు పెరబోయిన కార్తీక్, బాల్ ద వెంకటేష్, భూమండ ఇస్తారి, కొరటికంటే శ్రీధర్, మోతే మల్లేష్, వస్పర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో ఘనంగా రంజాన్ వేడుకలు...

**– ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి – అదనపు రెవిన్యూ కలెక్టర్ వెంకరెడ్డి – సబ్ కలెక్టర్ కృష్ణ రెడ్డి – తహసీల్దార్ సేకూరి జగన్ – మున్సిపాలిటీ చైర్మన్ వైస్ చైర్మన్**









**భువనగిరి,మార్చి 21 (ప్రజాజ్యోతి) :** జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో,సోమవారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగ, వేడుకలను ఎంతో భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే పట్టణంలోని ఈద్గా ఆవరణలోకి చేరుకున్న, ముస్లింలు సామూహికంగా ప్రత్యేక నమాజు చేశారు.పట్టణంలోని ప్రాచీన ఈద్ గాహ్‌లో మౌలానా తౌసీఫ్ ఆధ్వర్యంలో ఉదయం 9 – 30గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజు అనంతరం మౌలానా తౌసీఫ్ లు రంజాన్ పండుగ ప్రాముఖ్యతతో పాటు పవిత్ర ఖురాన్ బోధనలు,శాంతి సందేశం చదివి వినిపించారు. వేలాది మంది ముస్లిం సోదరులు తమ కుటుంబ సమేతంగా,ఆయా ఈద్గాలకు చేరుకుని ఉపన్యాసాలను ఆలకించారు. శాంతి, ప్రేమ సహనం,మానవత్వం వంటి మూల్యాలను పాటించడం ద్వారా సమాజాన్ని అభివృద్ధి చేయవచ్చని స్పష్టం చేశారు.రంజాన్ మహోత్సవం వల్ల వ్యక్తిగత ఆత్మశుద్ధి, సమాజంలోని అన్ని వర్గా ల మధ్య ఐక్యత పెంపొందుతుందని వివరించారు.

ప్రార్థనలు ముగిసిన వెంటనే ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుని "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

**వేడుకల్లో ఎమ్మెల్యే కుంభం ప్రత్యేక హాజరు...:** ఈ వేడుకల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్,పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయన ముస్లిం పెద్దలతో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ అనేది భక్తి, ఉపవాసం,పరస్పర ప్రేమ సహాయ సహకారాల ఉత్సవమని,అన్నారు.ఇది మత సామరస్యానికి,మానవ సంబంధాలకు ప్రతీకయని, అన్ని మతాల ప్రజలు కలిసి ఉండే భువనగిరిలో ఈ





వేడుక మరింత ప్రత్యేకంగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అంతేగాక పట్టణంలోని ముస్లిం సోదరుల సమస్యలను తెలుసుకుని,ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం సంక్షేమానికి సంబంధించిన పథకాలను ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు.

**ప్రభుత్వం తరఫున ప్రత్యేక ఏర్పాట్లు...:** రంజాన్ పండుగను పురస్కరించుకుని పోలీసు, మునిసిపల్, విద్యుత్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. యాదాద్రి భువనగిరి ఎస్పీ అక్షాంశ్ యాదవ్ డి స్పి రవీందర్ ప్రత్యేక పర్యవే క్షణలో ఆయా ఈద్గాల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. మునిసిపల్ అధికారులు మసీదుల పరిసర ప్రాంతాల్లో శుభ్రత పనులను పకడ్బందీగా నిర్వహించారు. విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుని,ఎక్కడా విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసుకుంది. మసీదుల వద్ద తాగునీటి సదుపాయాలు, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

**సాంప్రదాయ విందు..ఆనందంగా పండుగ వేడుకలు..:** రంజాన్ సందర్భంగా ప్రతి ఇంటిలోనూ భోజన విందు ఏర్పాట్లు జరిగాయి.షీర్ ఖుర్మా, బిర్యానీ,హలీం సేమియా వంటి సంప్రదాయ వంటకాలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆనందంగా పంచుకున్నారు. చిన్నారులు కొత్త బట్టలు ధరించి ఉత్సాహంగా రంజాన్ వేడుకలను జరుపుకున్నారు.ఈ వేడుకల్లో హిందూ, క్రైస్తవ తదితర మతాలకు చెందిన ప్రముఖులు కూడా పాల్గొని, ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భువనగిరిలో రంజాన్ వేడుకలు అన్ని మతాల ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని మరింత పెంచాయి.ఈ వేడుకల్లో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ నేతలు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ రంజాన్ వేడుకల్లో గ్రంధాలయం చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపాలిటీ చైర్మన్ తంగెల్లపల్లి రవికుమార్ వైస్ చైర్మన్ పోతం శెట్టి మంజుల,మత పెద్దలు శేక్ మీరా మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎండీ ఇంతియాజ్ అహ్మద్,ఎండీ ఇస్తియాక్ అహ్మద్,డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ మజహర్,కౌన్సిలర్ లు శఫీఖ్ అహ్మద్ జాలిగం విగ్నేష్

**బొంతల నర్సింహా, నాయకులు కౌసర్,హామీద్ పాషా,డాక్టర్ బారి :** అస్గర్ రబ్బానీ,బి ఆర్ ఎస్ పార్టీ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గొట్టిపర్తిలో సామాజిక న్యాయ "జగ్జీవన" జ్యోతి వెలిగింది



- **పూలే చూపిన విద్యా దీపం... జగ్జీవన్‌రామ్ చూపిన సమానత్వ మార్గం... ఇవే మనకు దిక్సూచులు**
- **ఎమ్మెల్యే మందుల సామెల్, బహుజన యుద్ధనౌక డాక్టర్ ఏపూరి సోమన్న**
- **అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ.. బాబు జగ్జీవన్ రావు విగ్రహ పునః ప్రతిష్ట**



**తుంగతుర్తి, మార్చి 21,(ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో సామాజిక చైతన్యానికి నాంది పలుకుతూ అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో మహనీయులు జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించగా.. భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాన్ని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్, బహుజన యుద్ధనౌక డాక్టర్ ఏపూరి సోమన్న చేతులమీదుగా శనివారం అదే స్థలంలో పునః ప్రతిష్ట చేసి అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడోత్సవాలను సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మహనీయుల విగ్రహాల నిర్వహణ కమిటీ అధ్యక్షులు చింతకుంట్ల విట్టల్ సభా అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. సమాజంలో సమానత్వం, విద్యాభివృద్ధి దళితుల హక్కుల కోసం వారు చేసిన కృషిని కొనియాడారు.మహనీయుల ఆలోచనలు ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలని, సమాజంలో ఐక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు.జ్యోతిరావు పూలే మహిళా విద్య, కులవ్యవస్థ నిర్మూలనలో కీలక పాత్ర పోషించగా, బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడిగా నిలిచారని పేర్కొన్నారు.పూలే చూపిన విద్యా దీపం... జగ్జీవన్‌రామ్ చూపిన సమానత్వ మార్గం... ఇవే మనకు దిక్సూచులనీ ఎమ్మెల్యే ఘాటైన సందేశం ఇచ్చారు. సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం ఆగకూడదని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలకల మంజుల వెంకన్న, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు,అరుంధతి యువజన సంఘం అధ్యక్షులు చింతకుంట్ల పరమేష్,ఉప సర్పంచ్ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ కేతిరెడ్డి లతా విజయకుమార్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, ఏవైసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం అజయ్ కుమార్, గౌరవాధ్యక్షులు చింతకుంట్ల వెంకన్న(బిల్డర్), విగ్రహ నిర్వహణ కమిటీ ఉపాధ్యక్షులు మందుల నరేష్, ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల పరమేష్ (బాబు), సభ్యులు మందుల పరమేష్, చింతకుంట్ల సైదులు, మాచర్ల ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రేగటి రవి, సుంకరి జనార్ధన్,వివిధ గ్రామాల సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు, యువజన లు మహిళలు భారీగా హాజరై మహనీయుల సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు ఆధ్వర్యంలో తుంగతుర్తి, మందిరాల ఎస్సై లు క్రాంతి కుమార్, వీరమల్లు పోలీస్ సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు

## సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలి

**సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సూర్యాపేట జిల్లా అధ్యక్షులు నవీన్ తేజ**



**కోదాడ టౌన్, మార్చి21 (ప్రజా జ్యోతి) :** హుజూర్ నగర్ నియోజకవర్గ మఠంపల్లి మండలంలో ఈనెల 24న జరగబోయే సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర ఐదవ మహాసభలను విజయవంతం చేయాలని సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సూర్యాపేట జిల్లా అధ్యక్షులు నవీన్ తేజ పిలుపునిచ్చినారు. శనివారం కోదాడ పట్టణంలో ఒక పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న మఠంపల్లి మండలం వి.ఆర్.ఎల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరగబోయే సమాచార హక్కు చట్టం 2005 రాష్ట్ర మహాసభలకు సూర్యాపేట జిల్లా నలుమూలల నుంచి ఆర్టిఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సంస్థలో పనిచేస్తున్న పాతవారికి మరియు కొత్తవారికి సముచిత స్థానము గౌరవం ఇవ్వడంతో పాటు, నూతన కమిటీల ఏర్పాటు, ఐడి కార్డ్స్ మరియు అభివృద్ధి పనులు పారదర్శకత అవినీతిరహిత సమాజ నిర్మాణానికి సంస్థ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ గెల్లా పవన్ కుమార్, నియోజకవర్గ ఇన్చార్జ్ గడ్డం అంజి, కోదాడ మండల గౌరవ అధ్యక్షులు అమరబోయిన వీరబాబు, మునగాల మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండలో నవగ్రహ
# విగ్రహాల ఏర్పాటుకు రూ.80 వేల విరాళం



నిజామాబాద్ రూరల్: మార్చ్, 21 (ప్రజా జ్యోతి) సిరికొండ మండల కేంద్రంలోని శ్రీ శేష సాయి లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం స్థానిక దాతలు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా దువ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డి, అర్జున్ రెడ్డి కుటుంబ సభ్యులు కలిసి రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని దువ్వూరు సంతోష్ రెడ్డి ద్వారా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, నవగ్రహాల విగ్రహాల ఏర్పాటుకు దాతలు చేసిన సహాయం అభినందనీయమని కొనియాడారు. దాతల కుటుంబానికి దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయుష్షు, ఆరోగ్యం కలగాలని శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని ప్రార్థించారు. గ్రామంలో దేవాలయ అభివృద్ధికి స్థానికుల సహకారం పెరుగుతుండడం సంతోషకరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు సంతోష్ రెడ్డి, చాకలి నాగేష్, దేశ్పాండే రమేష్, ఆలయ కమిటీ సభ్యులు కమ్మరి భాను, బైరి నాగేష్, ఎన్నం చిన్నారెడ్డి, కస్తూరి శ్రీనివాస్, పారిపెల్లి గంగాధర్, వారి పెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో దేవాలయ 6అభివృద్ధికి స్థానికుల సహకారం పెరుగుతుండటం సంతోషకరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఇమ్మడి గోపి కుటుంబాన్ని
# పరామర్శించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి

– దోషులకు శిక్ష పడేలా చూస్తాం – కుటుంబానికి అండగా ఉంటామని భరోసా
– ఇమ్మడి గోపి మరణం పార్టీకి తీరని లోటు – గోపి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించిన ఎమ్మెల్యే





ఇందల్వాయి( ప్రజా జ్యోతి న్యూస్) మార్చ్. 21 ఇందల్వాయి మండల కేంద్రంలోని గౌరారం గ్రామ సర్పంచ్ భర్త మాజీ ఎంపీపీ ఈమ్మడి గోపి ఇటీవల హత్యకు గురైన ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి కుటుంబ సభ్యులను నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి పరామర్శించారు. ఈ మేరకు శనివారం ఇందల్వాయి మండలం లింగాపూర్ గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇమ్మడి గోపి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్ష పడేలా చూస్తామని భరోసా కల్పించారు. పార్టీ పరంగా కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ మేరకు ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి గోపి మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవను స్మరించుకున్నారు. గోపి హత్యలో నిందితులు ఎవరున్నా చట్టప్రకారం శిక్ష పడేలా చూస్తామన్నారు. ఇప్పటికే ఈ విషయమై సీపీ,పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందని తెలిపిన ఎమ్మెల్యే దోషులకు శిక్ష పడేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని సూచించినట్లుగా తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, పార్టీ నాయకులు పొలసాని శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్,చింతల కిషన్, లారీ గంగారెడ్డి, ఉమ్మాజి నరేష్,రాంచందర్, పార్టీ కార్యకర్తలు,ఆయా గ్రామాల సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ప్రస్తావన లేని బడ్జెట్‌పై అసంతృప్తి

– సంక్షేమానికి నిధులు కేటాయించలేదని విమర్శలు



నిజామాబాద్ రూరల్: మార్చ్, 21 (ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 వార్షిక బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమంపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల రాజశేఖర్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టులకు సంబంధించి ఎలాంటి అంశాలు ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి నిధుల కేటాయింపు లేకపోవడం వల్ల సంక్షేమ కార్యక్రమాలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.ప్రభుత్వం సమాచార శాఖను పూర్తిగా విస్మరించిందని, మీడియా అకాడమీ గురించిన ప్రస్తావన కూడా బడ్జెట్‌లో కనిపించలేదని విమర్శించారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్లు కూడా ఇవ్వకుండా రెండు సంవత్సరాలుగా గడువులను పొడిగిస్తూ వస్తున్నారని, ఇది జర్నలిస్టులకు తీవ్ర అన్యాయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. ఉత్తమ జర్నలిస్టు అవార్డులు, మహిళా జర్నలిస్టుల సమస్యలు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు వంటి కీలక అంశాలపై బడ్జెట్‌లో రేఖామాత్రంగా కూడా ప్రస్తావించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్న మీడియాపై నిర్లక్ష్యం కనబడుతోందని అన్నారు. ఇంటి స్థలాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నెలలుగా నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు.ఇప్పటికైనా రాష్ట్రంలోని అన్ని జర్నలిస్టు సంఘాలు ఐక్యమై ప్రభుత్వంపై ఆందోళనలకు సిద్ధం కావాలని బందెల రాజశేఖర్ పిలుపునిచ్చారు.

# ఉప్లూర్‌లో సీసీరోడ్ల పనులను ప్రారంభించిన సర్పంచ్



కమ్మర్ పల్లి మార్చ్ 21,ప్రజా జ్యోతి. కమ్మర్ పల్లి మండలం లోని ఉప్లూర్ గ్రామానికి మంజూరైన రూ.18 లక్షల సిసి రోడ్ల పనులను గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకేట రవి శనివారం ఘనంగా ప్రారంభించారు. గ్రామంలో 2వ వార్డులో సీసీ రోడ్ల పనులను గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్,ఉప సర్పంచ్ తక్కురి ముత్యం పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, ఏలేటి మోహన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్, వార్డ్ సభ్యులు అనిల్, అజయ్, సంతోష్, రాకేష్, సురేష్, కాంగ్రెస్ నాయకులు వన్నెల రాజేశ్వర్, తిరుపతి రెడ్డి, సాదుల్లా, వెంకట్, సుంకరి విజయ్ కుమార్, సతీశ్, రాజారెడ్డి, ఆంజనేయులు ,రవి తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా పటిష్ట బందోబస్తు

– పోలీస్ కమిషనర్ పర్యవేక్షణ









నిజామాబాద్ రూరల్ మార్చ్, 21 (ప్రజా జ్యోతి ) నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అన్ని ఈద్గాలు మరియు ప్రధాన ప్రాంతాల్లో విస్తృత బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పండుగ రోజున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు భారీగా పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.పండుగ దృష్ట్యా మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో షీ టీమ్స్ ద్వారా నిఘా కొనసాగించడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలందరూ శాంతియుతంగా, సోదరభావంతో రంజాన్ పండుగను జరుపుకోవాలని కోరుతూ ఈద్గాల వద్ద ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలోని శాంతినగర్ ఈద్గాహ్, మదీనా ఈద్గాహ్, అలాగే బోధన్‌లోని నర్సీ రోడ్ ఈద్గాహ్ ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ శ్రీ ప్రకాష్, బోధన్ ఏసీపీ శ్రీ శ్రీనివాస్ రెడ్డి, ఆర్మూర్ ఏసీపీ శ్రీ వెంకటరెడ్డి, సీఐలు, ఎస్సైలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా ముగిసిన రంజాన్ ప్రార్థనలు

– ఈద్గా వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు – స్వయంగా బందోబస్తును పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర









కామారెడ్డి ప్రతినిధి మార్చి 21. (ప్రజాజ్యోతి) కామారెడ్డి పట్టణంలోని ఈద్గా మైదానంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తును జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఈద్గా మైదానానికి చేరుకున్న ఎస్పీ, బందోబస్తు విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. పవిత్ర రంజాన్ ప్రార్థనలు అత్యంత క్రమశిక్షణతో, శాంతియుత వాతావరణంలో ముగియడం జరిగింది. అని తెలిపారు. అనంతరం,జిల్లా ఎస్పీ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ని కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ముస్లిం సోదరులందరికీ పండుగ అభినందనలు తెలుపుతూ, సమాజంలో సోదరభావం, ఐక్యత మరింత పెంపొందాలని ఆయన పిలుపునిచ్చారు. భక్తుల రాకపోకలు పూర్తిగా ముగిసే వరకు బందోబస్తు కొనసాగుతుందని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరిస్తున్న ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి, ఎస్ఐలు, ముస్లిం సోదరులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఉప్లూర్‌లో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ



కమ్మర్ పల్లి మార్చ్ 21,ప్రజా జ్యోతి. కమ్మర్ పల్లి మండలం లోని ఉప్లూర్ గ్రామంలో ముస్లీం సోదరులు పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా శనివారం ఈద్గా వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేసిన అనంతరం వారిని కలిసి ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శైలేందర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని అన్నారు.సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం,ఐక్యత మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తక్కురి ముత్యం, నాయకులు మారుపక నరేష్ ,సంగా పెద్దలు రఫిక్, ఫారూఖ్, సాదుల్లా, అజారుద్దీన్, ఇబ్రహీం, ఇమెమోద్దీన్, హఫీజ్, సల్మాన్, నజీర్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామానికి పెద్దదిక్కుగా నిలిచిన జాదవ్ పండరి పటేల్



బాన్సువాడ ఆర్‌సి, మార్చ్ 21 (ప్రజా జ్యోతి) బీర్కూరు మండలంలోని బైరాపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకున్న నేపథ్యంలో గ్రామ పెద్దలు మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన యువకుడు గాదె మహేందర్ శుక్రవారం మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పెద్ద జాదవ్ పండరి పటేల్ ముందడుగు వేసి, బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఆయన ఆధ్వర్యంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ మొగుల్ గౌండ, నాయకులు నరసింహులు, హనుమంతరావు, చింతల శ్రీనివాస్ తదితరులు, గ్రామస్తులు మరియు యువకులు కలిసి మొత్తం రూ. 20,000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు స్పందిస్తూ, తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో ఇలాంటి కష్టసమయంలో ఐక్యంగా ముందుకు రావడం గ్రామీణ ఐక్యతకు నిదర్శనమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## షబ్బీర్ అలీకి రంజాన్
# శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మార్పీఎస్ నేతలు



కామారెడ్డి ప్రతినిధి మార్చి 21. (ప్రజాజ్యోతి) తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ ఆలీ షబ్బీర్ కి శనివారం తన నివాసంలో రంజాన్ పండగ సందర్భంగా శాలువా కప్పి, పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టెంకి బాల్ రాజు, ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట్ రాములు శుభాకాంక్షలు తెలిపారు.

# రంజాన్ శుభాకాంక్షలు


– మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి



రాజంపేట మార్చి 21 (ప్రజాజ్యోతి) రంజాన్ పండుగ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, రాజంపేట గ్రామ ఉపసర్పంచ్‌తో కలిసి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో ఆప్యాయంగా ముచ్చటించి, శాంతి, సౌహార్దంతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇక ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి శ్రీనివాస్ గారిని గ్రామ ఉపసర్పంచ్ సహా స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన
# గుంత వాహనదారులకు చింత

డోంగ్లి మండలం మార్చి 21 (ప్రజాజ్యోతి) డోంగ్లి మండల లింబూర్ గ్రామంలో ఎస్సీ కమిటీ హాల్ వద్ద ప్రధాన రోడ్డు పక్కన గుంత పడి ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నిత్యం రద్దీగా ఉంటే ప్రాంతంలో రోడ్డు పక్కన గుంత ఉండడంతో ప్రమాదం జరుగుతున్న గాని అధికారులు పట్టించుకోవడం లేదు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గుంత బారీగా ఏర్పడినప్పటికీ అటువైపు వెళుతున్న అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఉన్నప్పుడు గుంతను పూడ్చివేయాలని గ్రామప్రజలు వాహనదారులు పదేపదే అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు రాత్రిపూట గుంత అని తెలువక పోవడం వల్ల వాహనాదారులు . ప్రమాదాలు గురవుతున్నారు, ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి గొంతును పూడ్చివేసి చర్యలు తీసుకోవాలని లింబూర్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# స్త్రీ నిధి ఆర్థిక ప్రగతికి అడుగులు












- జిల్లాలో రికవరీలో కొల్చారం రెండవ స్థానం
- ఈ ఏడాది లక్ష్యం రూ. 3.55 కోట్లు
- అందించినవి 6.31. కోట్లు
- ఏపీఎం లక్ష్మి నారాయణ
- కోటి 30 లక్షలు లాప్స్‌కు అవకాశం?

**కొల్చారం (ప్రజాజ్యోతి) మార్చి 21:** మహిళా సాధికారత ధ్యేయంగా, గ్రామీణ మహిళలను ఆర్థికంగా ఆదుకు నేందుకు సంఘాలను రాష్ట్ర ప్రభుత్వాలు బలోపేతం చేస్తున్నాయి. ముఖ్యంగా స్త్రీ నిధి ద్వారా మహిళలకు ఆర్థిక సేవలు అందించడంలో అత్యుత్తమ సంస్థగా రూపొందింది. వెలుగు కార్యక్రమాలలో భాగ స్వామిగా ఉండటంతో పాటు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి ఆర్థిక సాయం అందిస్తోంది. అయితే కొల్చారం మండలం స్త్రీ నిధితో జీవన ప్రమాణాల మెరుగుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది 2025-26 సంవత్సరానికి రూ.3.55 కోట్లు మొత్తాన్ని రుణాలుగా ఇవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. కాగా లక్ష్యానికి అదనంగా 631.64 కోట్ల రుణాలు 1.77 % అందించగా రికవరీ కోసం 7 కోట్ల 4 లక్షలు 53 వేలు నిర్దేశించగా 6 కోట్ల 4 లక్షల 62 వేలు 88% రికవరీ చేసి జిల్లాలోనే కొల్చారం మండలం రెండవ స్థానంలో నిలిచిందని ఏపీఎం లక్ష్మి నారాయణ తెలిపారు . కాగా ఇందుకు గాను ఇటీవలే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, నర్సాపూర్ శాసనసభ్యులు సునీతా లక్ష్మా రెడ్డి లు మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు నిఖిత ను ఘనంగా సన్మానించి అభినందించారు నిదులు రికవరీ లో జిల్లాలో కొల్చారం రెండవ స్థానం లో నిలువగా మనోహరబాద్ మొదటి స్థానం, మూడవ స్థానం లో నర్సాపూర్ నిలిచింది.

మండలంలో 718 స్వయం సహాయక సంఘాలు ఉండగా 652 సంఘాల గాను 35 కోట్ల 69 లక్షల 70 వేలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది.అయితే 543 సంఘాలకు 36 కోట్ల 72 లక్షల పై చిలుక రుణాలు 102% అందించామన్నారు. మండలంలో స్త్రీ నిధి ద్వారా రుణాలు పొందిన 38 సంఘాలు మొండి బకాయిలను ఆర్ఆర్ యాక్ట్ ద్వారా రికవరీ చేయనున్నట్లు ఏపీఎం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు నేషనల్ రూరల్ లైవ్ లీడ్ మిషన్ ద్వారా 5 వందల ఎలక్ట్రిక్ బస్సులను అందించనున్న నేపథ్యంలో జిల్లాలోని 20 మండలాలకు 20 బస్సులను ప్రభుత్వం అందిస్తుంది. ఈ తరుణంలో మండలానికి ఒక్కో బస్సుకు 36 లక్షల నిధులను కేటాయిస్తూ రోడ్డు రవాణా సంస్థ మరియు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 5 సంవత్సరాల అగ్రిమెంట్ తో మండలానికి అందించనుంది. దీంతో ప్రతి నెల ఈఎంఐ రూపకంగా లాభాన్ని 69,600 ఆర్టిసి అందించనున్నట్లు పేర్కొన్నారు.

**కోటి 30 లక్షలు ల్యాప్స్..?**

మండలానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి 25 భవనాలకు గాను రెండు కోట్ల 50 లక్షలు మంజూరయ్యాయి. వీటితో 25 భవనాలను మార్చి చివరి లోగా నిర్మించాల్సి ఉంది. అయితే 22 భవనాల నిర్మాణానికి ఆయా సర్పంచ్ లు శంకుస్థాపన చేస్తూ భూమి పూజలు చేశారు. కాగా మండలంలోని రాంపూర్ 1, కిష్టాపూర్ 2 ,వరిగంతం 1, కొంగోడు 1, చిన్నగనాపూర్ 2, ఎనగండ్ల 2, పైతర 1, తుక్కాపూర్ 1, వెంకటాపూర్ 1, మొత్తం 12 భవనాల నిర్మాణాలు ప్రారంభించడంతో అవి వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. మిగతా సర్పంచ్ లు మంజూరైనా గ్రామాలలో 13 భవనాల నిర్మాణాలకు గాను ఎలాంటి పనులు ప్రారంభించలేదు. దీంతో సర్పంచ్ ల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వం నుండి మంజూరైన కోటి 30 లక్షల రూపాయలు నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. మార్చి చివరి వరకు అంటే వారం రోజులలో సంబంధిత సర్పంచ్ లు పనులు చేపట్టిన కనీసం బిస్మెట్ స్థాయివరకు ఉంటేనే బిల్లులు వస్తాయని అధికారులు అంటున్నారు.

**జిల్లాలో రెండవ స్థానం..**

స్త్రీ నిధి లోన్ రికవరీలో మండలాన్ని జిల్లాలోని రెండో స్థానంలో నిలిపిన ఏపీఎం లక్ష్మీనారాయణ తో పాటు సీసీలు యాదగిరి, వెంకటేష్, మమత ,విజయలక్ష్మి ,చోట మియా ల పనితీరు పట్ల ఉన్నతాధికారులు ఉత్తమ మండలంగా గుర్తించి వీరిని అభినందించారు. అలాగే మహిళా సమాఖ్య అధ్యక్షురాలను మహిళా అంతర్జాతీయ దినోత్సవం నాడు జిల్లా కలెక్టర్ మహిళా సమాఖ్య మండలం అధ్యక్షురాలు నిఖితను సన్మానించారు.

## అప్పాజీపల్లిలో వైభవంగా రథోత్సవం

- భక్తి శ్రద్ధలతో రథం లాగిన భక్తులు - పాల్గొన్న సర్పంచ్ వెంకట్ గౌడ్ (గజినీ)



**కొల్చారం (ప్రజాజ్యోతి)** రథోత్సవం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా శనివారం ఉదయం అప్పాజీ పల్లిలో నిర్వహించారు . నూతన సంవత్సరం ఉగాది పర్వదినం మరుసటి రోజున ఆనవాయితీ ప్రకారం సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజినీ) నేతృత్వంలో వందలాదిమంది భక్తులు,శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి 'గోవిందా గోవిందా' నామస్మరణతో రథాన్ని లాగుతూ, స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రధాన విధులగుండా తరలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలం నర్సిములు, వార్డు సభ్యులు నర్సిములు, రామాంజం, సుశీల, శేకులు,కార్య దర్శి పణిందర్, నాయకులు పహాడ్ పాషా, వీరేశం, సురేష్, యాదగిరి, పాండు, భాగేష్, నర్సింలు,, నాగరాజు, రవి, వెంకట్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా రంజాన్ వేడుకలు



**రాయికోడ్ మార్చి 21 (ప్రజా జ్యోతి)** మండలంలో పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదర సోదరీమణులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ఉదయం నుంచే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) నిర్వహించారు.పండుగ సందర్భంగా భక్తులు కొత్త దుస్తులు ధరించి మసీదులకు తరలివచ్చి సమూహంగా ప్రార్థనలు చేశారు.అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.రంజాన్ మాసం ముగింపుగా జరుపుకునే ఈ పండుగ ఆనందం,ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది.ఇళ్లలో ప్రత్యేక వంటకాలు, ముఖ్యంగా సేమియా (షీర్ ఖుర్మా) తయారు చేసి బంధుమిత్రులతో పంచుకున్నారు.చిన్నపిల్లలు పెద్దల ఆశీర్వాదాలు తీసుకుంటూ పండుగను ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.మొత్తంగా రాయికోడ్ మండలంలో రంజాన్ వేడుకలు శాంతియుతంగా,ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి.

## అంత్యక్రియలో పాల్గొన్న రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు రాహుల్ కిరణ్

**రాయికోడ్ మార్చి 21 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రం గ్రామ సర్పంచ్ రాధా తుకారం సోదరుడు బాలమొల్ల మల్లేశం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం ఆయన స్వగ్రామం రాయికోడ్‌లో నిర్వహించిన అంత్యక్రియల్లో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు రాహుల్ కిరణ్ మరియు వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.పార్టీ తరఫున ఎల్లవేళలా కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. వారితోపాటు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చేవెళ్ల విట్టల్, మండల ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబేద్ అలీ, సర్పంచులు మహబూబ్ పటేల్, బసవరాజ్, నరేష్, మొగులయ్య,యూత్ అధ్యక్షుడు అంజి ముదిరాజ్, మండల నాయకులు రవీందర్ కుమార్, శ్యామ్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొల్చారంలో ఘనంగా ఈదుల్ ఫితర్ వేడుకలు



**కొల్చారం (ప్రజాజ్యోతి) మార్చి 21:** ప్రపంచ వ్యాప్తంగా శాంతి సౌభాగ్యాలు వెల్లివిరిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కొల్చారం ఇమామ్ మహమ్మద్ ఈసాక్ శాంతి సందేశాన్ని ఇచ్చారు.శనివారం నాడు కొల్చారం మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈదుల్ ఫితర్ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కొల్చారం, రంగంపేట ఈద్గాల వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్ మహమ్మద్ ఈసాక్ శాంతి సందేశాన్ని ఇచ్చారు.ప్రార్థనల అంతరం ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రసిద్ధ షేక్ షాబొద్దిన్ దర్గా లో ప్రత్యేక ప్రార్థనల అంతరం ముస్లిం సోదరులు ఇమామ్ మహమ్మద్ ఈసాక్, అరిఫోద్దీన్, సయ్యద్ సాదాక్ అలీ, ఖదీర్, లు మాట్లాడుతూ హిందు, ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## వార్తలొస్తే తగ్గుతారు.. సద్దుమణిగితే తవ్వుతారు!

- కాళేశ్వరం మట్టిపై అక్రమార్కుల కన్ను - రూటు మార్చి మరీ రాత్రి వేళల్లో దందా





**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని రెడ్డిపల్లి మంతురు ప్రవాహక ప్రాంతమైన కాళేశ్వరంలో మట్టి మాఫియా మళ్లీ పడగ విప్పింది. కొద్దిరోజుల క్రితం ఇక్కడి మట్టి అక్రమ రవాణాపై పత్రికల్లో వార్తలు రావడంతో వెనక్కి తగ్గిన అక్రమార్కులు, ఇప్పుడు మళ్లీ తమ పంథా మార్చి దందాను మొదలుపెట్టారు. గతంలో ప్రధాన మట్టి గుట్టలను తవ్విన వీరు, ఇప్పుడు అధికారుల కళ్లుగప్పేందుకు వాటి పక్కనే ఉన్న చిన్నపాటి మట్టి దిబ్బలను టార్గెట్ చేస్తున్నారు. వార్త కథనాలు ప్రచురితమైనప్పుడు కొద్దిరోజులు సైలెంట్‌గా ఉండి, అంతా సద్దుమణిగింది అనుకున్నాక మళ్లీ తవ్వకాలు మొదలుపెట్టడంలో వీరు 'అతి తెలివి' ప్రదర్శిస్తున్నారు. ప్రధాన గుట్టలను తవ్వితే దూరం నుంచి కనిపిస్తుందని భావించి, లోతట్టు ప్రాంతాల్లోనూ, పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాల్లోనూ తవ్వకాలు జరుపుతున్నారు. తద్వారా బయటకు తవ్వకాలు జరిగినట్లు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు.

**నిశీధిలో నిధుల వేట**

పగటిపూట కాకుండా కేవలం రాత్రి వేళల్లోనే ఈ మట్టి రవాణా సాగుతుండటం గమనార్హం. చీకటి పడగానే జేసీబీలతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. గుర్తుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ అక్రమ రవాణా వల్ల ప్రకృతి సంపద హరించుకుపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రాత్రి పూట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్నికల హామీ నిలబెట్టుకున్న ప్రవీణ్ ముదిరాజ్

- రూ.50వేలు ఖర్చు చేసి ఈద్గా నిర్మాణం
- రంజాన్ సందర్భంగా ప్రవీణ్ ముదిరాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ముస్లిం సోదరులు









**అందోలు, మార్చి21, (ప్రజాజ్యోతి):** సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సొంత మేనిఫెస్టోలో పొందుపరిచిన ఎన్నికల హామీని ప్రవీణ్ ముదిరాజ్ నిలబెట్టుకున్నారు. అందోల్ మండలం కన్సాన్ పల్లి గ్రామంలో పోటాపోటీగా జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సొంత మేనిఫెస్టోతో బరిలో నిలిచి ప్రవీణ్ ముదిరాజ్ విజయ దుందుభి మోగించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని ఈద్గా నిర్మాణం కోసం రూ.50వేలు సొంత నిధులు ఖర్చు చేసి ఈద్గా నిర్మాణం చేపట్టారు. ఈద్గా నిర్మాణం పనులు ఇటీవల పూర్తి కాగా రంజాన్ పండుగ సందర్భంగా గ్రామంలోని ముస్లిం సోదరులు ఈద్గా వద్దకు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రవీణ్ ముదిరాజ్ ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఇచ్చిన మాట కోసం కట్టుబడి పనిచేసే తత్వం తనదని సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఈద్గా నిర్మాణం కోసం మాట ఇవ్వడం జరిగిందని, ఈద్గా వద్దకు వాహనాల రాకపోకలకోసం రోడ్డు లేకపోయినా రంజాన్ పండుగ నాటికి ఈద్గా నిర్మాణం పనులు పూర్తి చేయాలనే సంకల్పంతో కూలీలను పెట్టి నిర్మాణ పనులకు అవసరమైన సామాగ్రిని తరలించి పనులు చేయించినట్లు తెలిపారు. ఆ అల్లా దయతో పనులు చకచకా సాగిపోయాయి, ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసే ఈద్గా నిర్మాణం సకాలంలో పూర్తయిందని అన్నారు. భవిష్యత్తులో కూడా ముస్లిం సోదరుల కోసం తాను అండగా ఉంటానని అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మైనారిటీ నాయకులను ఒక్కొక్కరిని ప్రత్యేకంగా కలుస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్, యువ నాయకులు ఈశ్వర్, బాల్ రాజ్, సిద్ధు, మైనారిటీ నాయకులు అబేద్ మియా, వహీద్, షాన్ మియా, అబ్దుల్, జాహంగీర్, మురియాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపి సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు పాలాభిషేకం

- ఆర్టీసీలో ఉచిత ప్రయాణం 6వేల పెన్షన్
- తెలంగాణలో అమలు చేయాలి
- వికలాంగుల సమాఖ్య డిమాండ్




**తాండూరు మార్చ్ 21 ప్రజాజ్యోతి** : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సియం కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు తాండూరు వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు నెలకు రూ 6000 రూపాయల ఆసరా పెన్షన్ పెంచడంపై దివ్యాంగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని దివ్యాంగులకు రూ 6000 పెన్షన్ తో పాటు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యము కల్పించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేసిన విధంగానే తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సమాఖ్య ప్రతినిధులు చందు, గజ్జెలప్ప, రాజాసింగ్, నర్సిములు,మొగులప్ప వివిధ గ్రామాలకు చెందిన వికలాంగులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే టిఆర్ఆర్





**దోమ మార్చి 21 (ప్రజాజ్యోతి) :** దోమ మండల కేంద్రంలో రెండు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్ర వేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ సొంత ఇంటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి,సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే టిఆర్ఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే టిఆర్ఆర్





**దోమ మార్చి 21 (ప్రజాజ్యోతి) :** రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని దోమ మండల కేంద్రంలో, బొంపల్లిలో జరిగిన రంజాన్ వేడుకల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించిన ఎమ్మెల్యే టిఆర్ఆర్ వారిని ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## యువత ఐఏఎస్, ఐపీస్‌లను సాధించడం లక్ష్యంగా పెట్టుకోవాలి

ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్ మార్చ్ 21 ప్రజా జ్యోతి :** సివిల్ సర్వీసుల ద్వారా దేశానికి సేవ చేసే అవకాశంతో పాటు సమాజంలో గొప్ప గుర్తింపు హోదా లభిస్తాయని ఎమ్మెల్యే అన్నారు బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిగ్నేచర్ ఐఏఎస్ అకాడెమీ తో కలిసి మార్చ్ 22న (ఆదివారం) సివిల్ సర్వీసెస్ పై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భారాసా నాయకులు సాయిజెన్ శేఖర్ సిగ్నచర్ ఐఏఎస్ అకాడెమీ డైరెక్టర్ ఆర్. ఎస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పోస్టర్‌ని ఆవిష్కరించారు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ గతంలో బిఎల్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రూప్స్ డ పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి ఉచితంగా కోచింగ్ ఇచ్చినప్పుడు చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని, అలాగే నీట్‌లో ర్యాంకు సంపాదించిన వారికి ఉచితంగా ఐదు సంవత్సరాలు ఫీజులు కడుతూ ఎందరినో డాక్టర్లుగా తయారు చేయిస్తున్నారని ఇప్పుడు సివిల్స్ విషయంలో కూడా చొరవ తీసుకోవడం, విద్యా రంగంలో ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి చేస్తున్న కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. సిగ్నేచర్ ఐఏఎస్ అకాడెమీ డైరెక్టర్ ఆర్.ఎస్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవగాహనా సదస్సు ఉప్పల్‌లోని సిగ్నచర్ ఐఏఎస్ అకాడెమీ లో ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఇందులో పాల్గొనాలనుకునే విద్యార్థులు 8639882839 నెంబర్ కు మెస్సెజ్ చేసి రిజిస్టర్ చేసుకోవాలి అని కోరారు.



# రామాలయం చూద్దాం రండి

- పునః ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం
- కొలువుతీరునున్న సీతారాముల వారు
- ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న వేడుకలు
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ పిలుపు
- ఈనెల 27న సీతారామ చంద్రమూర్తుల వారి కళ్యాణోత్సవం





**తాండూరు మార్చ్ 21 ప్రజాజ్యోతి :** తాండూరు పట్టణం ఇందిరా నగర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో కొలువుతీరునున్న సీతారాముల వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పురాతన ఆలయం వద్ద పునఃనిర్మాణం పనులు తుది దశకు చేరాయని గుర్తు చేశారు. ఈ నెల 23 నుంచి అత్యంత వైభవంగా వేదమంత్రాలు సాక్షిగా ప్రారంభం కానున్న ఈ వేడుకలకు భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ వేడుకలను భక్తులందరి సహాయ సహకారాలతో అంగరంగ వైభవంగా నిర్మితమైన ఈ ఏకైక రామాలయంలో కొలువు తీరనున్న శ్రీరాముడు దర్శనమివ్వనునట్లు చెప్పారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వివరించారు. ఈ నెల 23వ తేదీన ఉదయం 6 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం ఉదయం 7 గంటలకు శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి ఆలయం వద్ద గల హనుమాన్ దేవాలయం నుండి నూతన రామాలయం వరకు మూల విరాట్ల శోభాయాత్ర నిర్వహించబ డుతుందని తెలిపారు. ఈ యాత్ర భద్రేశ్వర్ చౌక్ మీదుగా గాంధీ చౌక్, మర్రిచెట్టు కూడలి , వివిహెచ్ఎస్ పాఠశాల శివాజీ చౌక్ పాండురంగ స్వామి దేవాలయం మీదుగా యాత్ర సాగి ఆలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అదేవిదంగా మార్చి 24న శాస్త్రోక్తంగా సాగె హోమాలు, పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 25న సీతారామచంద్ర మూర్తులతో పాటుగా వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలు నిర్వహించనున్నామని తెలిపారు. 26న లోక కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు జరుగున్నాయని తెలిపారు.

మార్చి 27న శ్రీరామనవమిని పురస్కరించుకొని లోక కళ్యాణార్థం శ్రీ సీతారామచంద్ర మూర్తుల కళ్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని చెప్పారు. ఇంతటి మహత్తరమైన వేడుకలను తనివి తీరా తిలకించడం అదృష్టంగా భావించాలన్నారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు







- అన్ని మతాల పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని
- మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు
- ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పిన
- ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి
- మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి

**తాండూరు మార్చ్ 21 ప్రజా జ్యోతి :** ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి,ఆర్బిఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శనివారం రోజు ఉదయం రంజాన్ పర్వదినా న్ని పురస్కరించుకొని తాండూరు మండలం చెన్గెస్ పూర్ రోడ్డు మార్గంలో గల ఈద్గాలో రంజాన్ పండగ వేడుకలు జరిగాయి. ఇట్టి వేడుకలలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, ఆర్బిఓఎల్ కంపెనీ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి లు ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సంధర్బంగా ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకున్న అతిథులు (ఈద్ ముబారక్) రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. అదేవిదంగా తాండూర్ పట్టణంలో గల ఖబరస్తాన్, మజీద్ లకు,దర్గాల అభివృద్ధి కోసం దాదాపు రూ 85 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది అన్నారు. ఇట్టి పనులను త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలో అల్లాహ్ ను ప్రార్థించి అందరూ సుఖ సంతోషాలతో ఉండటం చాలా సంతోషకరమన్నారు. ఈ పండుగ వేడుకలలో పేదవారు కూడా సంతోషంగా ఉండాలని దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పేద కుటుంబాలకు తోఫా సెట్లను అందజేయడం జరిగిందన్నారు. ఈ పండుగ అందరూ సమానంగా జరుపుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ వేడుకలలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు అబ్దుల్ రావుఫ్, నయీమ్ అప్పు, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, కరణం పురుషోత్తం రావు, ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్ లు బంటు వేణు,అల్లాపూర్ శ్రీకాంత్, రామకృష్ణ , మల్లేశం, రాజు గౌడ్, బాలకృష్ణ రెడ్డి, జుంటుపల్లి వెంకటేష్ , నాయకులు,బంటు మల్లప్ప, అనిల్, అంకిత్, బిర్కట్ రఘు తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు..

## శేరిలింగంపల్లిలో ఘనంగా రంజాన్ వేడుకలు

- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేత అనిల్ కుమార్ యాదవ్






**శేరిలింగంపల్లి, మార్చి 21 (ప్రజాజ్యోతి) :** రంజాన్ పవిత్ర పండుగను పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్. శనివారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, ముస్లిం సోదరుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పండుగ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ...రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి, సోదర భావానికి ప్రతీక అని, నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ఆయనను సాదరంగా ఆహ్వానించి, పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ఎనలేని కృషి : వి జగదీశ్వర్ గౌడ్





**శేరిలింగంపల్లి,మార్చ్ 21 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాతృ శ్రీ నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ ఈద్గా నందు నిర్వహించిన ప్రార్ధనలో పాల్గొని ప్రజలకు రంజాన్ పర్వదిన శు భాకాంక్షలు తెలిపారు జగదీశ్వర్ గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....స్వరాష్ట్రంలో పేద ముస్లింలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని,అన్ని కులాలు,మతాలను సమానభావంతో చూస్తున్న సెక్యులర్ నాయకుడు సీఎం.ఏ.రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి,నియోజకవర్గ నాయకులు బల్లింగ్ యాదగిరి గౌడ్,శేఖర్ ముదిరాజ్, దేవరాజ్, మల్లికార్జున్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు నగేష్ నాయక్,మునఫ్ ఖాన్,రహీం,హనీఫ్, ఖాజా, ముషారఫ్, ఇస్మాయిల్, ముక్తార్, జాఫర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## బషీరాబాద్ మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు







**బషీరాబాద్ మార్చి 21 ప్రజాజ్యోతి :** బషీరాబాద్ మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు రంజాన్ పర్వదిన సందర్భంగా బషీరాబాద్ మండల కేంద్రంలో ఈద్గలో నిర్వహించిన రంజాన్ వేడుకలో గ్రామ సర్పంచ్ వెంకటేష్ మహారాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి సొసైటీ మాజీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ ముస్లిం సోదరులతో కలిసి పాల్గొని, ప్రార్థన చేసి ఈ సందర్భంగా ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం నెలకొలనని ఆకాంక్షించారు. మతసామ రాష్యానికి ప్రతికంగా ఈ పండుగను అందరూ కలిసి జరుపుకోవడం ఆనం దకమణి వారు పేర్కొన్నారు. బషీరాబాద్ మండలంలో మైల్వార్, ఎక్మాయి జీవన్గి మంతటి, దామర్చేడ్, నవల్గా, కాసిం పూర్ ,వివిధ గ్రామాలలో రం జాన్ పండుగ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ పండుగను సంతో షంగా జరుపుకున్నారు. ఈ సందర్భంలో ముస్లిం పెద్దలు ప్రజా ప్రతినిధు లకు ఘనంగా శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రజాక్, పవన్ ఠాకూర్, మునీర్ సిద్ధార్థ మునిర్ నర్సిం లు, రాజన్న ఆర్ఎంపీ డాక్టర్ నర్సింలు, నరేష్ చౌహన్, ఫయాజ్, కాలీద్, అనూఫ్, రవి, హైమాద్, సత్తార్, సునీల్ ప్రసాద్, దన్సింగ్, షేక్ సైబన్ మత పెద్దలు,ముస్లిం పెద్దలు, యువకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసిన సర్పంచ్ వెంకటేష్ మహారాజ్
- ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి
- సొసైటీ మాజీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్

## ఈద్ వేడుకల్లో పాల్గొన్న కొప్పుల మహేష్ రెడ్డి



**పరిగి, మార్చి 21 (ప్రజాశక్తి):** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని పరిగి పట్టణంలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకల్లో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు ఆచరించి ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం ఎంతో గొప్ప విషయం అని ఆయన తెలిపారు. సమాజంలో సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ముస్లిం సోదరులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుల మతాలకు అతీతంగా రంజాన్ వేడుకలు

- శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్
- ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ రంజాన్? కార్పొరేటర్



**శేరిలింగంపల్లి, మార్చ్ 21 (ప్రజాజ్యోతి) :** రంజాన్ పర్వదినం సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్... గోపిన గర్ ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ముస్లిం సోదరుల ఆహ్వానానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని రంజాన్ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లా డుతూ.. రంజాన్ పండుగలు పురస్కరించుకొని ప్రపంచం లోని ముస్లిం సోదర సోదరీమణులు నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడతారని గుర్తు చేశారు. రంజాన్ మాసం యొక్క గొప్పతనాన్ని శాంతి, సోదరభావం మరియు దానధర్మాల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ తమ సందేశాలను అందించారు. ఈ సందర్భంగా ఈద్గా కమిటీ సభ్యులు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేస్తూ.. భవిష్యత్తులో ఉన్నత పదము లను అధిరోహించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఈద్గా కమిటీ సయ్యద్ గఫర్, జాకేర్,అజామ్, ఇక్బాల్, గఫుర్, అఫు,ప్రెసిడెంట్ గద్దం రవి యాదవ్, మహమ్మద్, షకీల్,సత్తార్, ఖాదర్ ఖాన్,అజీజ్, ఇబ్రహీం, గఫర్, షైబాజ్, దావుద్, తహెర్,ముక్రమ్, ఇర్ఫాన్, మోహమ్మద్ అజీమ్, అజర్, ఖలీం, కిరణ్ యాదవ్, భరత్ గౌడ్, రేవంత్,రాజు పటేల్,శేరిలింగంపల్లి నియోజకవర్గ ముస్లిం సోదరులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వాసవి బంధన్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

- గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ మేడ నరేష్
- డాక్టర్ నారాయణస్వామి, గ్లోబల్ సెక్రెటరీ ఎలెక్ట్






**ఎల్బీనగర్, (ప్రజా జ్యోతి) ప్రతినిధి :** శ్రీ లక్ష్మి కన్వెన్షన్ హాల్ కర్మన్ గాట్ లో మహిళా దినోత్సవం మేడ నరేష్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కమిటీ సభ్యులు డాక్టర్ నారాయణస్వామి గ్లోబల్ సెక్రటరీ, గ్రాంధీ సతీష్ గ్లోబల్ ట్రెజరర్, నాగేష్ కమలాపురం వైస్ ప్రెసిడెంట్, విజయలక్ష్మి నీల, గ్లోబల్ ప్రెసిడెంట్, వనిత విభాగ్, కలకొండ వసంతి, గ్లోబల్ సెక్రటరీ వనిత విభాగ్, శివ నీరజ గ్లోబల్ ట్రెజరర్ వనిత విభాగ్, నూతన కమిటీ ఏర్పాటు ఈ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాము నరేష్ మాట్లాడుతూ మా యొక్క సేవా కార్యక్రమా లు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన సేవా భావంతో కొనసాగుతాయని వెల్లడించారు కోవిడ్ సమయంలో రేషన్ నిత్యవసర సరుకులు ఆర్థికంగా ఇబ్బంది కలిగినవారికి అందజేశాము పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం మా గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నాము అవార్డుల ప్రధానోత్సవములు . అక్కినేని అమల తీసుకోవడం జరిగినది .ఇంకా "మా గ్లోబల్ ఫౌండేషన్ "ద్వారా సమాజంలో అనేక రకాల సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని ఈ సందర్భంగా నరేష్ వెల్లడించారు డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ ఈ మహిళా దినోత్సవం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉత్సాహభరితంగా కొనసాగింది ఈ కార్యక్రమంలో "తంబోలా గేమ్స్" ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం అందజేశాము మహిళలు వారి హక్కులు సమాజం పట్ల వారి బాధ్యతలను వేదిక మీద మాట్లాడడం జరిగింది, ఇంకా ముందు మా "గ్లోబల్ ఫౌండేషన్" ద్వారా అనేక రకాల సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని ఈ సందర్భంగా డాక్టర్ నారాయణస్వామి వెల్లడించారు ఈ కార్యక్రమంలో వేలాదిమంది మహిళలు నాయకులు పాల్గొని విజయవంతం చేశారని ఈ సందర్భంగా తెలియజేశారు.

## చౌక ధరల్లో మెడిసిన్ కోసం జన ఔషధి కేంద్రాలను వినియోగించాలి:

### కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ బ్యూరో,మార్చి 21 (ప్రజాజ్యోతి )
మెడిసిన్స్ కొనుగోలు సామాన్య ప్రజలకు భారంగా మారుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు.
శనివారం కరీంనగర్ నగరంలోని ముకరంపుర డాక్టర్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద ప్రజలకు వైద్యం భారంగా మారకూడదనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంతో పాటు జన ఔషధి కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.



ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందులు అధిక ధరలకు లభిస్తున్నందున, కొనుగోలు చేయలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ మందులు అందించేందుకు కేంద్రం పెద్ద ఎత్తున జన ఔషధి కేంద్రాలను ప్రారంభించిందన్నారు.
ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన పథకం కిందఈకేంద్రాలునిర్వహించబడుతున్నాయని, బ్రాండెడ్ మందులపై ఖర్చును తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో కూడా చౌక ధరలకు మందులు అందుబాటులో ఉంచడం లక్ష్యమన్నారు. జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.

## రంజాన్ పండగ త్యాగం, నియమం, సేవాభావానికి ప్రతీక

చొప్పదండి ,మార్చి 21 ( ప్రజాజ్యోతి):
రంజాన్ పండుగ త్యాగం, నియమం, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తుందని చొప్పదండి మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు.
శనివారం రుక్మాపూర్ లోని ఈద్గా ప్రాంగణంలో రుక్మాపూర్, కాట్నపల్లి, చాకుంట గ్రామాల ముస్లిం సోదరుల రంజాన్ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ సోదరుల అభివృద్ధి లేకుండా సమాజ అభివృద్ధి అసాధ్యమని, ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ముస్లిం సోదరులు ప్రాథమిక సదుపాయాలకు నోచుకోక పోవడం బాధాకరమని అన్నారు. ప్రజా ప్రతినిధులు మాటలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వచ్చి సమస్యలు పరిష్కరించాలని, పదవిలో ఉన్నా లేకపోయినా తాను సమస్యల పరిష్కారమే కృషి చేస్తానని చెప్పారు. రుక్మాపూర్, కాట్నపల్లి, చాకుంట గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తానని, ప్రతి ఇంటికి తాగునీరు, మంచి రోడ్లు, మెరుగైన విద్యా సదుపాయాలు అందే వరకు పోరాటం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. మతసామరస్యం దెబ్బతినేలా చేసే ఏ శక్తినైనా ప్రజలు ఖండించాలని, దేశ బలం ఐక్యతలోనే ఉందని, అందరూ కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## బ్రహ్మోత్సవాల్ పోస్టర్ ఆవిష్కరణ


ఇల్లందకుంట మార్చి 21(ప్రజాజ్యోతి):
అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరగనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబులకు అందజేశారు. మంత్రులను శాలువాలతో సన్మానించి, ఆలయ చైర్మన్ ఇంగిలే



రామారావు దేవస్థానం జ్ఞాపికలను అందజేశారు. శ్రీరామనవమి ఉత్సవాలకు కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్, ధర్మకర్తలు పరమేష్, నారాయణరెడ్డి, రాజేందర్, మల్లేష్, రామ్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు. పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

## చౌక ధరల్లో మెడిసిన్ కోసం జన ఔషధి కేంద్రాలను వినియోగించాలి:

కరీంనగర్ బ్యూరో,మార్చి 21 (ప్రజాజ్యోతి )
మెడిసిన్స్ కొనుగోలు సామాన్య ప్రజలకు భారంగా మారుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు.
శనివారం కరీంనగర్ నగరంలోని ముకరంపుర డాక్టర్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద ప్రజలకు వైద్యం భారంగా మారకూడదనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంతో పాటు జన ఔషధి కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.




ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందులు అధిక ధరలకు లభిస్తున్నందున, కొనుగోలు చేయలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ మందులు అందించేందుకు కేంద్రం పెద్ద ఎత్తున జన ఔషధి కేంద్రాలను ప్రారంభించిందన్నారు.
ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన పథకం కిందఈకేంద్రాలునిర్వహించబడుతున్నాయని, బ్రాండెడ్ మందులపై ఖర్చును తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో కూడా చౌక ధరలకు మందులు అందుబాటులో ఉంచడం లక్ష్యమన్నారు. జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.

## కరీంనగర్ టూటౌన్ ఎస్సై ఆత్మహత్య

- భార్య మృతితో మనస్తాపం
- ఉరి వేసుకొని ఆత్మహత్య
- 5 రోజుల వ్యవధిలో దంపతులిద్దరూ మృతి
- అనాథలైన ఇద్దరు చిన్నారులు
- కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాదం

కరీంనగర్ క్రైం,మార్చి 21,ప్రజాజ్యోతి:
జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది,కుటుంబంలో వరుసగా జరిగిన విషాదాలతో ఒక పోలీసు అధికారి జీవితమే చీకటిలో కలిసిపోయింది,భార్య మృతిని తట్టుకోలేక కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ యాదవ్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.పోలీసుల వివరాల ప్రకారం జమ్మికుంట మండలం సీతంపేట గ్రామంలోని అత్తగారింట్లో ఎస్సై చంద్రశేఖర్ యాదవ్ శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు,కాగా ఈ దుర్ఘటనకు ముందు కేవలం అయిదు రోజుల క్రితమే ఆయన భార్య దివ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుంది.కరీంనగర్ హనుమాన్ నగర్ లో నివాసం ఉంటున్న టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ భార్య దివ్య కడుపునొప్పి తీవ్రతను భరించలేక గన్నేరు పప్పు తిని ప్రాణాలు తీసుకుంది,ఆమె మరణం కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది,భార్య మృతి తరువాత తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్ యాదవ్ మానసికంగా పూర్తిగా కుంగిపోయినట్లు కుటుంబ సభ్యులు,స్థానికులు చెబుతున్నారు,శనివారం ఐదోవ రోజు కార్యక్రమానికి





అత్తగారింటికి వచ్చిన చంద్రశేఖర్ తన జీవిత భాగస్వామిని కోల్పోయిన వేదనను తట్టుకోలేక చివరకు ఆయన కూడా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది,5 రోజుల వ్యవధిలోనే దంపతులిద్దరూ మృతి చెందడం అందరినీ షాక్‌కు గురి చేసింది,ఈ విషాద ఘటనతో వారి ఇద్దరు చిన్న పిల్లలు ఒక్కసారిగా తల్లిదండ్రుల ప్రేమను కోల్పోయి అనాథలుగా మారడం హృదయ విదారకంగా మారింది,కుటుంబ సభ్యులు,బంధువులు,గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు,సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు,అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు,ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు,ఆత్మహత్యకు దారితీసిన ఖచ్చితమైన కారణాలపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు,ఈ ఘటనతో కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది,పోలీసు వర్గాల్లోనూ ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది,సహచరులు,ఉన్నతాధికారులు ఈ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కోవడానికి మానసిక ధైర్యం అవసరమని,సమస్యలు ఎంత పెద్దవైనా ఆత్మహత్య సరైన పరిష్కారం కాదని పలువురు సూచిస్తున్నారు,

## పదవులు పోయినా బలుపు తగ్గలేదా?

చొప్పదండి, మార్చి 21 ( ప్రజా జ్యోతి):
ప్రస్తుతం ఎలాంటి పదవుల్లో లేకపోయినప్పటికీ చొప్పదండి మండలంలోని ఒక ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలకు బలుపు తగ్గ లేదని పలువురు ఘాటుగా విమర్శిస్తున్నారు. పదవిలో ఉన్నన్ని రోజులు వీరి ఆగడాలకు అంతే లేదని, ప్రజలు తగిన గుణపాఠం నేర్పి ఇంట్లో కూర్చోబెట్టారని, అయినా వీరికి బుద్ధి రావడం లేదని విమర్శించారు. పని పాట లేని కొందరు జులాయి (ప్రస్తుతం నాయకులు)ల వల్ల ఆ పార్టీకి వచ్చే ఓట్లు కూడా రాకుండా పోతాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. నాయకులకు చెంచాగిరి చేస్తూ బతకడమే వీరి పని అని, నాయకులు ఏది చెప్తే అది వీరు చేస్తుంటారని అన్నారు. ఇటువంటి పోరంబోకులను వాడుకొని రాజకీయం చేసే కొందరు నాయకుల వల్ల పార్టీ అప్రతిష్ఠ పాలవుతున్నదని ఆ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘవిద్రోహ నాయకులకు, కార్యకర్తలకు అధిష్టానం ఎందుకు మద్దతు పలుకుతుందో అర్థం కావడం లేదన్నారు. ఆ పార్టీకి చెందిన ఒక నాయకుని పై ల్యాండ్ సెటిల్మెంట్లు, నేర చరిత్రపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. మరో నాయకుని పై సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకొని కోట్లు సంపాదించాడన్న ఆరోపణలు ఉన్నాయి. వీరు ఇరువురు నాయకులు తమకు అధిష్టానం వద్ద పలుకుబడి ఉన్నదని బెదిరిస్తూ ఎన్నో కుంభకోణాలు చేశారు. తోడుదొంగల మాదిరిగా వ్యవహరించారు. అవినీతి అక్రమాలకు నీకు నేను అండ, నాకు నీవు అండ అన్నట్లు పనులు చక్కబెట్టుకున్నారు. వీరే కొందరు సంఘ విద్రోహులను పెంచి పోషిస్తున్నారు. గతంలో వివిధ నేరారోపణలతో కేసుల్లో ఉండటంతో నాయకుల అనుచరులకు పోలీసులు ఫుల్లుగా "కోటింగ్" ఇచ్చారు. అయినప్పటికీ అనుచరుల ప్రవర్తన, బుద్ధి ఇంకా మారలేదని పలువురు వ్యాఖ్యానించారు. సంఘ విద్రోహ శక్తులకు పదవులు ఇస్తే "కనకపు సింహాసనంబున శునకమును కూర్చుండబెట్టినట్టు" గానే వ్యవహరిస్తారని పలువురు అంటున్నారు. ఇటువంటి వారికి అధిష్టానం వత్తాసు పలకడం మానుకోవాలని సూచించారు.

# ఇల్లందకుంటలో రైతు సంఘం ఆగ్రహం

### “వ్యవసాయనామ సంవత్సరం” అంటూ బడ్జెట్‌లో కోతలు అన్యాయం

ఇల్లందకుంట, మార్చి 21 (ప్రజాజ్యోతి):
రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరాన్ని “వ్యవసాయనామ సంవత్సరం”గా ప్రకటించి, అదే సమయంలో వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం రైతాంగాన్ని విస్మరించడమేనని తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది.
శనివారం ఇల్లందకుంట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.
2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు కేటాయించగా, గత ఏడాది కంటే ఇది తక్కువేనని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తూ నిధులు తగ్గించడం విరుద్ధమైన చర్య అని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగంలో “క్యూర్, ప్యూర్, రేర్” లక్ష్యాలను ప్రస్తావిస్తూ వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను చెప్పినా, బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తూ రూ.1.11 లక్షల కోట్ల మేరకు వాటా అందిస్తున్నప్పటికీ, రైతులకు అవసరమైన మద్దతు అందడం లేదని ఆవేదన వ్యక్తం



చేశారు. రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలులో స్పష్టత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూ భారతి అమలు నేపథ్యంలో రెవెన్యూ కోర్టుల పునరుద్ధరణ, పహాణి పత్రికలో కౌలు దారుల పేర్ల నమోదు వంటి అంశాలు పక్కన పడిపోయాయని అన్నారు. పంటల బోనస్, కనీస మద్దతు ధరల నిర్ణయంపై స్పష్టమైన విధానం లేకపోవడం రైతులకు నష్టమని పేర్కొన్నారు.
పత్తి, వరి పంటలపైనే ఆధారపడి సాగు జరుగుతుండగా, వాటికీ సరైన మద్దతు ధరలు అమలుకావడం లేదని విమర్శించారు. కౌలు రైతులకు రక్షణ లేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పెరిగి ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం వందలాది మంది రైతులు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఆందోళనకరమని తెలిపారు. పంటల రుణ ప్రణాళికలు అమలులో లోపాలు ఉన్నాయని, లీడ్ బ్యాంకులు రైతులకు అవసరమైన రుణాలు అందించడంలో విఫలమవుతున్నాయని అన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో పంట బీమా, ప్రకృతి వైపరీత్యాల పరిహారం, మార్కెట్ జోక్యం పథకాలకు తగిన నిధులు కేటాయించకపోవడం రైతులకు మరింత భారమని చెప్పారు. ప్రభుత్వ ప్రకటనలకు అనుగుణంగా బడ్జెట్‌ను సవరించి, కనీసం మొత్తం బడ్జెట్‌లో 6 శాతం నిధులను వ్యవసాయ రంగానికి కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

## తల్లి లేని అనాథను... మా తండ్రిని కాపాడండి: శ్రీనాథ్ విజ్ఞప్తి

ముస్తాబాద్, మార్చి 22 (ప్రజా జ్యోతి):
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన పల్నాటి రాజయ్యకు నిన్న రాత్రి ఆకస్మికంగా పక్షవాతం రావడంతో సిద్దిపేటలోని లోహిత్ సాయి హాస్పిటల్‌లో చేర్చి చికిత్స అందిస్తున్నారు. కుటుంబం అత్యంత పేద పరిస్థితుల్లో ఉండటంతో వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారింది.
ఇప్పటికే కుటుంబంలో తల్లి, అక్క, అన్నలు అనారోగ్యంతో మృతి చెందగా, ప్రస్తుతం 12 ఏళ్ల కుమారుడు శ్రీనాథ్ మాత్రమే రాజయ్యకు ఆధారం. తాజాగా తండ్రికి పక్షవాతం రావడంతో బాలుడు పూర్తిగా దిక్కుతోచని స్థితిలో నిలిచిపోయాడు.
“మా నాన్న ప్రాణాలు కాపాడండి... మీకు తోచినంత సహాయం చేయండి” అంటూ కుమారుడు శ్రీనాథ్ దాతలను వేడుకుంటున్నాడు.
దయచేసి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించి ఒక కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.
సహాయం పంపాల్సిన ఫోన్ పే నంబర్: 9618751687
పేరు: పల్నాటి రాజయ్య



## పలు వార్డులను సందర్శించిన గ్రామ సర్పంచ్ దార సురేష్

ఇల్లందకుంట మార్చ్ 21(ప్రజాజ్యోతి):
ఇల్లందకుంట గ్రామంలోని ఐదవ వార్డులో గ్రామ సర్పంచ్ దార సురేష్ శనివారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని పలు వీధులు, కాలనీలు, నివాస ప్రాంతాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను పరిశీలించారు. స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా ముచ్చటిస్తూ వారి రోజువారీ సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా లోపాలు, కాలువల శుభ్రత సమస్యలు, చెత్త సేకరణలో ఉన్న లోపాలు, వీధి దీపాలు పనిచేయకపోవడం, రహదారుల దెబ్బతినడం వంటి అనేక సమస్యలను ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విన్న సర్పంచ్ దార సురేష్ వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖ అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.
గ్రామాభివృద్ధి కోసం ప్రతి సమస్యను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. గ్రామంలో పరిశుభ్రతను మెరుగుపరచడం, తాగునీటి సరఫరాను సక్రమంగా అందించడం, వీధి దీపాలను మరమ్మతు చేయించడం, రహదారులను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రజలు కూడా గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వ పథకాలపై అవగాహన



పెంచుకోవాలని సర్పంచ్ సూచించారు. ప్రజల సహకారం ఉంటేనే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ప్రతి వార్డులో ఇలాంటి పర్యటనలు నిర్వహించి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే విధానాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదవ వార్డు సభ్యురాలు దయ్యాల లక్ష్మి (రంజిత్), వార్డు సభ్యులు పల్లెర్ల శ్రీకాంత్, మంకు కుమార్, మంకు ప్రశాంత్, సమ్మెట రామకృష్ణ, ఎరుకొండ శ్రీనివాస్, అమృత ఓదెలు తదితరులు పాల్గొన్నారు. వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇలాంటి ప్రత్యక్ష పర్యటనలు తరచుగా నిర్వహించాలని కోరారు.

## వేములవాడలో మల్టీ జోన్ - 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు.

వేములవాడ,మార్చ్,21:ప్రజాజ్యోతి.
ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భీమేశ్వర ఆలయంలో మల్టీ జోన్ – 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ గారు శనివారం రోజున స్వామి వారికి ఐజిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ ఆలయానికి మల్టీ జోన్ –1ఐజిపి వచ్చిన సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఆలయ ఈ.ఓ రమాదేవి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.
ఈ సందర్భంగా ఐజిపి పోలీస్ అధికారులతో మాట్లాడుతూ...





దక్షిణకాశిగా పేరుగాంచిన వేములవాడకు దేశం నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివస్తారని, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.భక్తుల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో గస్తీ పెంచాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.
కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,ఆలయ ఈ. ఓ రమాదేవి,వేములవాడ,సిరిసిల్ల,డీఎస్పీలు శ్రీనివాస్,నాగేంద్రచారి,ఇన్స్పెక్టర్ లు,ఆర్.ఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు..

## అంగడి ప్రారంభోత్సవానికి కరపత్రాల పంపిణీ.......

ఎల్లారెడ్డిపేట మార్చి 21( ప్రజా జ్యోతి)
ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో ప్రతి సోమవారము నిర్వహించనున్న గ్రామ సొంత అంగడి ప్రారంభానికి గ్రామపంచాయతీ సన్నాహాలు చేపట్టింది. ఈ సందర్భంగా గ్రామంలో విస్తృతంగా కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రచార కార్యక్రమాన్ని



ప్రారంభించారు .గ్రామ సర్పంచ్ అందే సుభాష్ ఉపసర్పంచ్ దేవేందర్ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాల పంపిణీ చేశారు. ఈనెల 23 2026 సోమవారం ఉదయం 9 గంటలకు గ్రామ సంత అంగడిని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అంగడిలో ప్రజల కావలసిన కూరగాయలు, నిత్యవసరం సరుకులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అలాగే అన్ని రకాల కూరగాయల వ్యాపారులు నిత్యవసర వస్తువులను వ్యాపారులు ఈ అంగడిలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ముస్తాబాద్‌లో మున్నూరు కాపు నూతన కమిటీ తొలి సమావేశం

ముస్తాబాద్, మార్చి 22
( ప్రజా జ్యోతి):
ముస్తాబాద్ మండలంలో మున్నూరు కాపు నూతన కమిటీ తొలి సమావేశం మండల అధ్యక్షుడు బొప్ప నర్సయ్య ఆధ్వర్యంలో ముస్తాబాద్ మున్నూరు కాపు సంఘ భవనంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు,



మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య మాట్లాడుతూ మున్నూరు కాపులు బీసీ జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ చైతన్యంలో కొంత వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. అందరూ ఐక్యంగా ఉండి కలిసికట్టుగా ముందుకు సాగాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో అవసరమున్న వారికి అందుబాటులో ఉంటూ మున్నూరు కాపుల ఐక్యత, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.
మండల అధ్యక్షుడు బొప్ప నర్సయ్య మాట్లాడుతూ తనను మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని మున్నూరు కాపుల సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉంటూ, వారి అభివృద్ధి మరియు సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.
ఈ సమావేశంలో మెంగని రాజు, మెంగని మనోహర్, శీలం స్వామి, చెక్కపెల్లి రాజు, కుక్కల దేవేందర్, తోట ధర్మేందర్, మెంగని శ్రీనివాస్, ఆది లక్ష్మణ్, బొప్ప శ్రీధర్, శ్రీనివాస్, బొప్ప విష్ణు, శీలం సుధాకర్, రాజు, సురేష్, రాములు, వెంకటయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు




**వేంసూరు. మార్చి 21. ప్రజాజ్యోతి** మండల కేంద్రమైన వేంసూరులోని ఈద్గా వద్ద రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇమామ్.ప్రసంగిస్తూ రంజాన్ పర్వదినాన నమాజ్,,ఫితరా, జకాత్, రోజా, తరావీ నమాజ్, వీటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంత కరుణామయుడు అల్లా పట్ల భక్తి భావంతో ఉండాలని, నమాజు ప్రాముఖ్యతను, అదేవిధంగా తారబీ నమాజు ఇవన్నీ చాలా ప్రాముఖ్యత కలిగినవి, అల్లాహ్ నుండి క్షమాబిక్ష కోరాలని ఇలా కోరినట్లయితే చేసిన పాప కార్యాలు క్షమించబడతాయని, క్షమించేందుకు అల్లా సిద్ధంగా ఉన్నాడని వేషి ఇమామ్ అన్నారు. చిన్నలు పిల్లలు మహిళలు అందరూ ఇస్లాంను ఎల్లవేళలా ధర్మాన్ని విడనాడకుండా ఉండాలని, నమాజును ఇమాం. షేక్ ముఫ్తేజుల. చేయించారు. ఆయన అన్నారు. ప్రత్యేక దు వ చదివారు. పాపాలను క్షమించాలని అల్లాను కోరుకున్నారు. స్వర్గలోక ప్రాప్తి లభించాలని కోరుకున్నారు. నమాజు అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అదేవిధంగా కులాతీత మతాతీతంగా అందరు ఈ రంజాన్ పండుగకు ఈద్గా వద్దకు ప్రజలు ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అందరూ చల్లగా ఉండాలని కోరుకున్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు




**నేలకొండపల్లి, మార్చి 21 ప్రజా జ్యోతి:** మండలం లోని వివిధ గ్రామాలలో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంజాన్ మాసం అత్యంత నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు పాటించి రంజాన్ పండుగ ను నిర్వహించుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందు...ముస్లింలు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కోరట్లగూడెం ఈద్గా వద్ద జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాలకు రంజాన్ ప్రతీక అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... అల్లా దయతో అందరి జీవితాలలో ఆనందం. ఆయురారోగ్యాలు మెండుగా ఉండాలని కోరారు. నేలకొండపల్లి లో రియల్ ఎస్టేట్స్ ప్రతినిధి షేక్ ఖాసింసాహెబ్ నివాసంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. షేక్ ఖుదూషియా, షేక్ ఖుర్షద్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో జరిగిన పలు చోట్ల జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, రేగూరి వాసవి, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణ స్థలం స్వాధీనం



– హద్దులు తొలిగించిన రెవిన్యూ సిబ్బంది




**నేలకొండపల్లి, మార్చి 21 ప్రజా జ్యోతి:** ప్రభుత్వ స్థలం ను ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేయటంతో అధికార యంత్రాంగం కంచె ను తొలిగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలం ను స్థానికుడు అక్రమించుకుని కంచె ఏర్పాటు చేశారు. ఈ విషయంలో గ్రామంలో వివాదం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి ఘటన స్థలం వద్దకు వెళ్లి కంచె ఏర్పాటు చేయవద్దని సూచించారు. కానీ వారు ఖాతరు చేయకపోవటంతో ఈ మేరకు స్థానిక సర్పంచ్ బోయిన వేణు. పంచాయతీ కార్యదర్శి హనుమంతు లు స్థానిక తహశీల్దార్ కు ఫిర్యాదు . చేశారు. కాగా ఇటీవల పలు మార్లు సర్వే నిర్వహించారు. శనివారం నేలకొండపల్లి తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు లు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. పంచనామా నిర్వహించిన అనంతరం ఆక్రమణ నిర్ధారణ కు వచ్చారు. ఈ మేరకు పంచాయతీ – రెవిన్యూ సిబ్బంది తో ఆక్రమణదారులు వేసిన కంచె ను తొలిగించారు. ప్రభుత్వ స్థలం ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడారు... ప్రభుత్వ స్థలాల ఆక్రమణ ను సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# సమైక్యతా సౌరభం.. రంజాన్ సంబరం!

– ముస్లిం సోదరులతో తుంబూరు దయాకర్ రెడ్డి ఆత్మీయ ఆలింగనం

**ఖమ్మం రూరల్ ప్రజాజ్యోతి :** భారతీయ జీవన స్రవంతిలో అంతర్భాగమైన గంగా–జమునా తెహజీబ్‌కు నిలువుటద్దంగా, మత సామరస్యానికి మకుటాయమానంగా రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఏదులాపురం ప్రాంతంలో మిన్నంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**సంక్షేమ పథకాలపై భరోసా..**

ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ప్రభుత్వం మైనారిటీల పక్షపాతి. విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లిం సోదరులకు అండగా ఉంటూ, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మంత్రి పొంగులేటి లక్ష్యం" అని భరోసా ఇచ్చారు.

**ఆత్మీయ ఆతిథ్యం..**

పండుగ వేళ ఆత్మీయతను చాటుతూ మద్దులపల్లిలోని ఎస్.కె. జానీ నివాసానికి, ఖమ్మం నగరంలోని సీనియర్ నాయకులు ఎస్.కె. ఇమామ్ భాయ్ గృహానికి వెళ్లిన దయాకర్ రెడ్డి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించి ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ వేడుకల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమారి, బైరు కోటేశ్వరరావు, ముస్లిం సోదరి సోదరీమణులు,తదితరులు పాల్గొన్నారు.

### పేదవారి ఆకలి తీర్చడంలో

# రంజాన్ పౌనఃపున్యాన్ని చాటింది

– ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆధ్యాత్మిక గురువులు మౌలానా షేక్ ముజాహిద్



**మధిర ప్రజా జ్యోతి** రంజాన్ మాసంలో పాటించిన నీతి,నిజాయితీ, క్రమశిక్షణ ఆధ్యాత్మిక మార్గాన్ని ఏడాదంతా కొనసాగిస్తే ఉన్నత పౌరులుగా ఎదగొచ్చు అని తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆధ్యాత్మిక గురువులు మౌలానా షేక్ ముజాహిద్ అన్నారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా మధిర పట్టణంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెరిజల్లుతూ రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్) వేడుకలను అల్లాహ్ నామస్మరణతో ముస్లిం సోదరులు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మధిర ఈద్గా వద్దకు వందలాది మంది ముస్లిములు చేరి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన ధార్మిక సందేశంలో గురువులు మౌలానా షేక్ ముజాహిద్ రంజాన్ సందేశాన్ని బోధించారు. రంజాన్ పండుగ సమానత్వానికి, మానవత్వానికి, నిలువుటద్దమని ముజాహిద్ తెలిపారు. సోదరులు నెలరోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షలు చేపట్టి,క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని గడపడం ప్రతి ఒక్కరికీ [illegible] పేర్కొన్నారు. ముఖ్యంగా జకాత్ వంటి దానధర్మాల ద్వారా పేదవారి ఆకలి తీర్చడం రంజాన్ పౌనఃపున్యాన్ని ఈ మాసం చాటిందన్నారు. పౌరులు నీతి, నిజాయితీ క్రమశిక్షణతొ కూడిన జీవనాన్ని ఎంచుకోవాలి అన్నారు. మనిషి మంచి ప్రవర్తన సమాజంలో గౌరవాన్ని పెంచుతుందని వివరించారు. అలాగే సమాజం వెనుకబడిన వర్గాలను ఆదుకోవడానికి తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం ఈ మాసంలో లక్షలాది రూపాయలు వెచ్చించి జాకత్ వంటి నియమాలను పాటిస్తూ వేలాది తోఫా కిట్లను కుల మతాలకు అతీతంగా అందించిందని తెలిపారు. సమాజంలో శాంతి కోసం మనం చేసే పవిత్ర ప్రార్థనలు దోహదపడాలని సోదరులకు వివరించారు.

### రంజాన్ పండుగతో

# ప్రేమతో వడ్డించిన 'తీపి' విందు



**చింతకాని మార్చి 21ప్రజా జ్యోతి** రంజాన్ పండుగ వేళ మమ్మల్ని మీ ఇంటికి ఆహ్వానించి, ముకుమ్మడిగా విందునిచ్చినందుకు మైనారిటీ సోదరులందరికి ధన్యవాదాలు. మీరు తినిపించిన సేమ్యా పాయసంలో పండగ తీపి కంటే మీ అందరి ప్రేమే ఎక్కువగా కనిపించింది. మతాలు వేరైనా, మనం పంచుకునే ఈ ప్రేమానురాగాలు ఎప్పటికీ ఇలాగే ఉండాలని ఆశిస్తున్నాము. అద్భుతమైన ఆతిథ్యాన్ని అందించిన మీ కుటుంబాలు అన్ని వేళల సుఖ, సంతోషాలతో సమృద్ధిగా ఉండాలని కోరుకుంటూ మీ మొత్తానికి మా తరపున మరొక్కసారి ధన్యవాదములు.

### భద్రాచలం అభివృద్ధికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి కొండా సురేఖ




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి21, ప్రజాజ్యోతి:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధిపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ , దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోత్ రామ్ చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "భద్రాచలం పునర్నిర్మాణం , పునరుజ్జీవనం" ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం దేశవ్యాప్తంగా భక్తుల విశ్వాసానికి నిలయమని, ఆలయం మరియు పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యాత్రికుల సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పార్కింగ్ సదుపాయాలు, రహదారుల విస్తరణ, పరిశుభ్రత పరిరక్షణ వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని పేర్కొన్నారు. మాడ వీధుల అభివృద్ధి, కల్యాణ మండప నిర్మాణం, రామవనం అభివృద్ధి, డిజిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా, శుభ్రమైన మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. కల్యాణ మండపాన్ని ఆకర్షణీయంగా అలంకరించడంతో పాటు లైటింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక చర్యలు, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఇతర అధికారులు, ప్రాజెక్ట్ రూపకర్తలు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పద్మశాలి సేవా అవార్డుకు ఎంపికైన గోచికొండ శ్రీదేవి



**ఇల్లందు, మార్చి 21, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లో శనివారం, ఆదివారాల్లో జరిగే పద్మశాలి ఉగాది పురస్కారాలలో ఇల్లందు పట్టణానికి చెందిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి పద్మశాలి సేవా అవార్డుకు ఎంపికయ్యారు. గోచికొండ శ్రీదేవి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగుతున్నారు. శ్రీదేవి గత 20 ఏళ్లుగా పద్మశాలి కులస్థులు రాజకీయంగా, ఆర్థికంగా వివిధ రంగాలలో ఎదగాలని చాలా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా హైద్రాబాద్ లో జరిగే పద్మశాలి సంఘ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావడం జరిగింది. ఇల్లందు పట్టణ పద్మశాలి సంఘంలో శ్రీదేవి ఎన్నో కార్యక్రమాలలో భాగస్వామ్యం కావడం జరిగింది. ఇల్లందులో ఉన్న సుమారు 8వేల మంది పద్మశాలి కులస్థులకు గోచికొండ శ్రీదేవి సుపరిచితురాలు. పద్మశాలి ఉగాది పురస్కారాలలో అవార్డు వచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి అధ్యక్షురాలు కొండా పద్మగ, వల్ల కంటి రాజ్ కుమార్ లకు శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిదంగా ఇల్లందు పట్టణ పద్మశాలి సంఘం హర్షం వ్యక్తం చేస్తూ అధ్యక్షుడు గోచికొండ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు వలపదాస్ శంకర్ లింగం, ఊరగొండ ధనుంజయ్, గౌరవ సలహాదారు సిరిమల్లె రాజు, వైస్ ప్రెసిడెంట్ గోచికొండ సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్లు ఆడెపు నరసింహరావు, మామిడి రమాకాంత్, దోమల మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సిరిమల్లె రమేష్, కోశాధికారి సిరిమల్లె నాగరాజు, కార్యదర్శులు జోగు సతీష్ కుమార్, కర్నాటి వెంకట రాజు, జాయింట్ సెక్రటరీ మొగ్గల శామ్ కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటర్లు వలపదసు రాజేష్, గోచికొండ ఈశ్వర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు కందకట్ల బిక్షపతి, కోట కిశోర్, వడ్డికశెర్ల రాహుల్, యూత్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# రంజాన్ సందర్భంగా పేదలకు బియ్యం పంపిణీ



**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలోని పరివర్తన యశోద ఫౌండేషన్ సేవాసమితి కార్యాలయం ఆవరణలో పేద వృద్ధులు, వికలాంగులకు బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముదిగొండ సంకీర్తన సహకారం అందించారు. ముందుగా రంజాన్ సందర్భంగా స్వీట్లు, లడ్డూలను పంపిణీ చేసి, అనంతరం అవసరమైన వారికి బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద సయ్యద్ అబ్దుల్ మునాఫ్, వృక్షమిత్ర––గ్రీన్ భద్రాద్రి లయన్ డా. గోళ్ల భూపతిరావులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రంజాన్ నెల ఉపవాసాలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసి పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పేదలకు దానం చేయడం సమాజంలో సమానత్వాన్ని పెంచుతుందని తెలిపారు. సేవాసమితి అధ్యక్షులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా పేదలకు సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అలవాల రాజా పెరియార్, కిష్ట శ్రీనివాస్ వాల్మీకి, కుంజ అర్జున్, కొమ్మగిరి నిహాల్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి అన్యాయం: బడ్జెట్‌పై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కొప్పుల రవీందర్ విమర్శించారు. భద్రాచలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ, వాటికి తగిన నిధుల కేటాయింపులు లేవన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు భారీగా పేరుకుపోయినప్పటికీ వాటి చెల్లింపుపై స్పష్టత లేదని, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో మౌలిక వసతుల లోపం, గురుకులాలు, కేజీబీవీ భవనాల సమస్యలపై బడ్జెట్‌లో సరైన ప్రస్తావన లేదన్నారు. విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో కార్తీక్, తరుణ్, పృథ్వి, సాయికుమార్, అన్వేష్, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు

– భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరుల ప్రార్థనలు
– అధిక సంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు

**అశ్వాపురం, మార్చి 21,ప్రజాజ్యోతి దినపత్రిక,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండల కేంద్రంలోని మంచి కంటి నగర్ ఈద్గా ప్రాంగణంలో అమ్మగారిపల్లి ఈద్గాలో మండలంలో ముస్లిం సోదరులందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో ఈద్–ఉల్–ఫితర్ నమాజులు చేశారు. ఈ సందర్భంగా మత గురువు నాసిర్ సుభాని ప్రసంగిస్తూ... గత 1400 సంవత్సరాల క్రితం రంజాన్ మాసంలో షబేఖదర్(27)వ రోజున ఖురాన్ అవతరించిన సందర్భంగా రంజాన్ మాసానికి అత్యంత ప్రాముఖ్యత మరియు అధిక ప్రాధాన్యత ఇస్తూ ముస్లిం సోదరులు నెల రోజులపాటు కటోరమైన ఉపవాస దీక్షను ఉదయం సహారితో ప్రారంభించి సాయంత్రం ఇఫ్తార్ వరకు కనీసం మంచినీరు త్రాగకుండా ఉమ్మి మింగకుండా ఉపవాస దీక్షను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ ఉపవాస దీక్ష వలన ఆకలితో ఉన్న పేదవారి ఆకలి బాధ తెలుస్తుందని తద్వారా ఆకలితో అలమటిస్తున్న పేదవారికి ఆకలి తీర్చే విధంగా దాన, ధర్మాలు చేయటానికి దోహదపడతాయని తెలిపారు. ఇందులో భాగంగా 1,24,000 మంది ప్రవక్తలలో చివరి ప్రవక్త అయిన మహమ్మద్ ప్రవక్త సూచించిన సద్ మార్గాలలో భాగంగా...5 పూటల నమాజ్, కుర్బానీ, జకాత్,ఫిత్ర, జీవితంలో ఒక్కసారి అయినా హజ్ యాత్ర చేపట్టడం అనే వారు సూచించిన మార్గాలను ప్రతి ముస్లింలు తప్పకుండా పాటించి ఇతరులతో సోదర భావంతో మెలుగుతూ, విరివిరిగా దానధర్మాలు చేస్తూ, పరమత సహనం పాటిస్తూ, తోటి వారికి సహాయ, సహకారాలు అందిస్తూ, యావత్ ప్రజలందరూ సుఖసంతోషాలు తో జీవించాలని, ముస్లిం సోదరులకు ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్ )శుభాకాంక్ లు తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులు పిల్ల పాపలతో అలింగనం చేసుకుంటూ, ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) తెలియజేసుకున్నారు. అదేవిధంగా జామా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఈద్గాలో పండగ ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో... జామా మసీద్ కమిటీ అధ్యక్షులు వారి కమిటీ సభ్యులు, మతగురువులు,మస్లిం మతపెద్దలు,ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

– దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

– తొగుట మండల కేంద్రంలో పొద్దుతిరుగుడు, మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన చెరుకు

తొగుట, మార్చి 21(ప్రజాజ్యోతి): రైతులు పండించిన పొద్దుతిరుగుడు పువ్వు గింజలు, మక్కజొన్న లను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే అమ్మాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శనివారం తొగుట మండల కేంద్రంలో పొద్దుతిరు గుడు, మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర లభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.రైతులు మధ్యవర్తుల చేతుల్లో నష్టపోకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా తమ పంటలను విక్రయించుకోవాలని సూచించారు.

ఈ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు, సమయానికి చెల్లింపులు అందుతాయని తెలిపారు. హమాలీ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పొద్దుతిరుగుడు గింజలకి క్వింటాలుకు 7,721 రూపాయలకు కొనుగోలు చేస్తారని, మొక్కజొన్న కంకులను వేరు చేసే యంత్రాలతో మార్పిడి చేస్తే నాణ్యమైన విత్తనాలు రావడం జరుగు తుందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తిగా ఆరబెట్టిన, తెగుళ్లు సోకకుండా ఉన్నవి, రంగు మారకుండా ఉన్న విత్తనాలు మార్కెట్ కు తీసుకొని రావాలన్నారు.

రైతుకు మార్కెట్ కు విత్తనాలు తెచ్చేటప్పుడు రైతు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికార ధృవీకరణ పత్రం తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో



గ్రామ సర్పంచ్ పాగాల శోభా కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, సీఈవో గంగారెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, చందా సత్తయ్య, బెజ్జనబోయిన రాములు, పిట్ల బిక్షపతి, జీడిపల్లి స్వామి, ఆత్మ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, సర్పంచ్ లు చిక్కుడు కళావతి స్వామి, గౌడుగు జయమ్మ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, బందారు రమేష్ గౌడ్, చిలివేరి రాంరెడ్డి, భారత్ తేజ,మల్లారెడ్డి, దేవునూరి పోచయ్య, గంట రవీందర్, శ్రీనకర్ రెడ్డి, పోతరాజు రవి, బాలకృష్ణ, నరేష్, నర్సింలు, అనిల్, ఆంజనేయులు, అర్జున్,కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు ముంగిట ఆయిల్ పామ్ ప్రాజెక్ట్

రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ అనిరూప్ రెడ్డి

కొండపాక, మార్చి 21( ప్రజా జ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తుందని, రైతు ముంగిట ఆయిల్ పామ్ ప్రాజెక్ట్ ను తీసుకువచ్చిందని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ , రాష్ట్ర కిసాన్ సెల్ ప్రెసిడెంట్ ఎస్ అనిరూప్ రెడ్డి పేర్కొన్నారు.ఆయన నంగునూర్ మండలం నర్మెట్ట కు వెళ్తూ కొండపాక మండలం దుద్దెడ లో కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల శ్రీనివాస్ కార్యాలయం వద్ద



కొద్దిసేపు ఆగారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు తమ పంటలను కాపాడుకోవడం కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పంటలు పండించాలంటే కీటకాలు కోతుల బెడద ఎన్నో రకాల ఇబ్బందులు ఉన్నాయని, పంట మార్పిడి అవసరమని రైతులు ఒక్కసారి ఆలోచించి ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి సారించాలన్నారు.ఈ పంట లాభదాయకమైనదని తెలిపారు. ఒకప్పుడు పండించిన పంటను అశ్వరావుపేట తీసుకెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు మన తెలంగాణలో అది నంగునూరు మండలం నర్మెట లో పెద్ద ప్రాజెక్టు రేపు ఓపెన్ చేయడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. సి ఎం చేతులమీదుగా ఆదివారం రోజు రైతు భరోసా వేయడం సంతోషకరమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తొగుట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోవింద రెడ్డి , మంచాల చిన్న శ్రీనివాస్ కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసరి లింగారావు కనక రాములు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అనిరూప్ రెడ్డి ని శాలువాతో సత్కరించారు.

## తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

మొదటిపేజీ తరువాయి..

ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. తెలుగు రాష్ట్రాల్లోన్రూ రంజాన్ శోభ కనిపించింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఇక,



హైదరాబాద్ నగరం సైతం రంజాన్ వేడుకలకు సిద్ధమైంది. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు ముస్లిం సోదరులు. చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఇవాళ(శనివారం) ఉదయం 10గంటలకు ప్రారంభంకానున్నాయి.

మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్–ఉల్–ఫితర్ ప్రార్థనలు చేయనున్నారు. పాతబస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరాలం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకుంటున్నారు. మరికొద్దిసేపట్లో సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. మీరాలం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారతదేశంలో రంజాన్ పండుగను శనివారం జరుపుకుంటున్నారు.

## ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఫోన్

మొదటిపేజీ తరువాయి..

మసూద్ పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కాలం పశ్చిమ ఆసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకువస్తుందని ఆశాభావం మోదీ వ్యక్తం చేశారు. ఇరాన్ నాయకుడితో జరిపిన ఫోన్ సంభాషణలో మోడీ ఇరాన్‌లో కీలక మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగిస్తాయని నొక్కి చెప్పారు. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించడం, షిప్పింగ్ మార్గాలు తెరిచి సురక్షితంగా ఉండేలా చూడాలని దాని ప్రాముఖ్యతను మోడీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## తుక్కాపూర్ గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తా

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

తుక్కాపూర్ లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తొగుట, మార్చి 21(ప్రజాజ్యోతి): తుక్కాపూర్ గ్రామ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయని



దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తొగుట మండలం తుక్కపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ నిధుల ద్వారా మంజూరైన 10 లక్షల రూపాయల సీసీ రోడ్డు పనులకు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుక్కాపూర్ గ్రామంలో ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, వాటిని లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. వచ్చే నెలలో గ్రామానికి మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందిస్తామని తెలిపారు. అనంతరం తుక్కాపూర్ గ్రామానికి చెందిన చిక్కుడు ఉపలయ్య ఇందిరమ్మ ఇళ్లు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిక్కుడు కళావతి స్వామి, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), సర్పంచ్ కు పాగాల శోభా కొండల్ రెడ్డి, వార్డ్ సభ్యులు గొడుగు శ్రీశైలం, రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు బరెంక్కల స్వామి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఉల్లెంగల సాయి ముదిరాజ్, సీనియర్ నాయకులు చిలివేరి రాంరెడ్డి, నిరంజన్ రెడ్డి, బందారు రమేష్ గౌడ్, భారత్ తేజ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## మరింత దిగిన బంగారం ధర

మొదటిపేజీ తరువాయి..

రూ.1,48,910 రూపాయలు.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,36,550 రూపాయలు ఉండింది. అయితే శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ బంగారంపై 2,940 రూపాయలు.. 22 క్యారెట్ బంగారంపై 2,750 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,970 రూపాయల దగ్గర.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,33,800 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. బంగారం మాదిరిగానే వెండి ధరలు కూడా భారీగా పతనం అయ్యాయి. నిన్న కిలో వెండి 2,60,000 రూపాయల దగ్గర.. 100 గ్రాముల వెండి 26,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు కిలోపై 10 వేల రూపాయలు.. 100 గ్రాములపై వెయ్యి రూపాయలు తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి 2,50,000 రూపాయల దగ్గర, 100 గ్రాముల వెండి 25 వేల రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

## మొన్న భార్య.. నేడు భర్త ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి..

అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు.చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం. ఈ క్రమంలో భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యవసాయ రంగంలో మరో మైలురాయి

మొదటిపేజీ తరువాయి..

ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయడైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు. సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ్' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సమీకృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2-3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశుగ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిదుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.

## డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

మొదటిపేజీ తరువాయి..

పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ క్షఖీఖీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ÷ూజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లిస్తున్నారు సిట్ అధికారులు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్న్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967